

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14 సంచిక: 04 హైదరాబాద్ 2014 ఆగస్టు పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**

## అవతార్ మెహెర్‌బాబా 169వ ప్రేమిక సహవాస్

అవతార్ మెహెర్‌బాబా 169వ ప్రేమిక సహవాస్ 17.08.2014 ఆదివారం మెహెర్‌స్థాన్, కొవ్వూరులో నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంకీర్తనలు సో॥ అభయ్ ఉబాలే & పార్టీ, "నిజమైన యోగము", అనే అంశంపై శ్రీ రవీంద్ర ప్రసంగం, శ్రీ ఉమామహేశ్వర సింగ్, హైదరాబాద్‌చే మెహెర్ ప్రభు చరితము ధారావాహిక ప్రసంగం, తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు శ్రీ ఆర్ ఎన్ మూర్తి తెలిపారు.

# మెహెరాబాద్‌లో ప్రతి వారం

ఏడాది పొడుగూతా మెహెరాబాద్‌లో బాబావారి సమాధి ప్రతిరోజూ ఉదయం 6 నుండి రాత్రి 8 దాకా విచ్చేసే ప్రేమికుల కోసం తెరచి వుంటుంది. కాగా, ప్రతిరోజూ 6 గంటలకు సమాధి పరిశుభ్ర సేవ వుంటుంది. ఆ తర్వాత, ఉదయం 7 గంటలకు తిరిగి సాయంత్రం 7 గంటలకు ప్రార్థనలు, ఆరతి నిర్వహిస్తారు. ఆ దరిమలా ఉదయం 10 నుండి 12.30 దాకా ఆయా ప్రత్యేక రోజులలో మెహెరాబాద్ నుండి ప్రత్యేక ఉచిత బస్సు పర్యటన కార్యక్రమాన్ని బాబా ట్రస్టు నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక బస్సు యం.పి.ఆర్, ఆంధ్రా రెస్టు హౌసుల ద్వారా మెహెరాబాద్‌లోని డి-హాస్టలు దగ్గర నుండి బయలుదేరుతుంది. ఆ **పర్యటన వివరాలు పాఠకుల** సౌకర్యార్థం **క్లుప్తంగా తెలియజేస్తున్నాం. దయచేసి పరిశీలించండి.**

**సోమవారం:** ఉ. 10 నుండి 12.30 అహ్మద్‌నగర్ ట్రస్టు ఆఫీసుకు
**మంగళవారం:** ఉ. 10 నుండి 12.30 మెహెరాజాద్‌లోని బాబావారి ఇంటికి
**బుధవారం:** ఉ. 10 నుండి 12.30 మెహెరాబాద్ సమాధి ప్రాంగణ సందర్శన
**గురువారం:** ఉ. 10 నుండి 12.30 మెహెరాజాద్‌లోని బాబావారి ఇంటికి
**శుక్రవారం:** ఉ. 10 నుండి 12.30 అహ్మద్‌నగర్ ట్రస్టు ఆఫీసుకు,
**శనివారం:** ఉ. 10 నుండి 12.30 అహ్మద్‌నగర్ ట్రస్టు ఆఫీసుకు,
సా. 6 గంటలకు పంచవటి గుహ సందర్శన
**ఆదివారం:** ఉ. 10 గంటలకు 12.30 మెహెరాజాద్‌లోని బాబావారి ఇంటికి

****

# బాబా సందేశం

On the spiritual path, the only sin is hypocrisy. Be honest.

ఆధ్యాత్మిక మార్గంలో మహాపరాధం హిపోక్రసీ (కపటం) !!

నిజాయితీగా ఉండండి.

**- మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**krishnanandm@yahoo.com**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. తెలుగు సహవాస్ 6-11
3. పంచగని 12-19
4. లార్డ్ మెహెర్ 20-27
5. మెహెర్‌స్థాన్ 30-32
6. బాబా అంతరంగం 33-34
7. మా మాటలు 35
8. మాయదారి కోడిపిల్ల 36
9. మహేబళేశ్వర్‌లో బాబా 37
10. ప్రార్థనలు


**ముఖ చిత్రం**

టైగర్‌వ్యాలీ, పంచగనిలో అవతారుడు ఏకాంతంగా వున్న గుహ.


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# జయహో మెహెర్‌బాబా

జయహో మెహెర్‌బాబా పేరిట ఒక సంగీత, సాహిత్య బృంద కార్యక్రమాన్ని కర్నాటక రాష్ట్రంలోని భైరమంగళ విశ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో 2014 అక్టోబరు 12న ప్రారంభించి సుమారు 20 రోజులపాటు తెలుగునాట గల పలు జిల్లాలలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనిబాబా, చెన్నై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం పావగడ, కదిరి ధర్మవరం, హిందూపురం ఆ దరిమిలా హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌ల మీదుగా విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, చివరిగా శ్రీకాకుళంలో ముగుస్తుందని శ్రీనిబాబా అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంపత్ అయ్యంగార్‌గారి మనుమరాలు డా॥ వసుమతి తమకు ఇచ్చిన బాబావారి పాదుకలను బాబా ప్రేమికుల దర్శనార్థం తమవెంట తీసుకువస్తున్నామన్నారు.

## చీపురుపల్లి బాబా సెంటర్ రజతోత్సవ వేడుకలు

చీపురుపల్లి బాబా సెంటర్ రజతోత్సవ వేడుకలు 2014 నవంబర్ 1, 2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సెంటర్ అధ్యక్షులు శ్రీ పెద్ది మహేశ్వరరావు (093934 33034) ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశం గల బాబా ప్రేమికులు తప్పక హాజరుకావల్సిందిగా ఆయన మనవి చేశారు.

## జలనిధి



గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

# సంపాదకీయం ...స్వర్గాదపి గరీయసి

1930 జూన్ ఒకటో తేది.
మెహెర్‌బాబా పంచగని నుండి మెహెరాబాద్‌కు తిరిగి వచ్చిన తొలినాళ్ళవి.
దేశంలో స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతోంది.
శాసనోల్లంఘన ఉద్యమం మధ్యలోంచి,
బాబా ప్రేమికుడు నౌసర్‌వాన్ సాతా బాబా దర్శనార్థం మెహెరాబాద్‌కు వచ్చాడు.
ఉద్యమంలో పాల్గొంటూ తీరిక చేసుకుని,
నా కోసం వచ్చినందుకు చాలా సంతోషంగా వుందన్నారు బాబా.
నౌసర్‌వాన్‌తో భారత స్వాతంత్ర్యం గురించి అనేక విషయాలు బాబా ప్రస్తావించారు.
ఈ పోరాటాలు, ఉద్యమాలు నా కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నారు.
బ్రిటీషువారు, భారతీయులు,
హిందువులు - ముస్లింలు,
అందరిలో నేను ఉన్నాను. అందరూ నాకు సమానమే.
బ్రిటీషువారు కూడా ఇండియాకు ఎనలేని సేవలు చేస్తున్నారు.
ఐతే అది మీకు తెలియదు.
వైస్రాయి లార్డ్ ఇర్విన్, మహాత్మా గాంధీ ఇద్దరూ చాలా మంచివాళ్ళు.
వారు ఒకరికొకరు వ్యతిరేకులైనా, ఈ దేశానికి మంచి పనులు ఎన్నో చేస్తున్నారు.
ఆధ్యాత్మికంగా వారిద్దరూ నాకెంతో సన్నిహితులు.
గత అవతారాల కాలం నుండీ వారికి నాతో ఆధ్యాత్మిక సంబంధం వుంది.
**అనాదిగా భారత దేశం ఆధ్యాత్మికంగా ఉన్నత స్థానంలో వుంది.**
**ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప ఇండియాలో జన్మించ లేరు.**
ఇండియాలో జన్మించిన వారు ఆధ్యాత్మికంగా గర్వపడాలి.
ఇక్కడ జన్మించినవారు, వారి ఆధ్యాత్మిక లక్ష్యాన్ని త్వరగా సాధించగల్గుతారు.
అమెరికా, యూరోప్, ఆఫ్రికా తదితర దేశాలలో జన్మించిన వారు,
ఎవరైతే ఈ జన్మలో మంచి పనులు చేస్తారో, వారికి రాబోయే జన్మ
ఇండియాలో లభించే అవకాశం ఉంది.
అలాగే, ఈ జన్మలో ఇక్కడ చెడు కర్మలు చేసినవారు
అమెరికా, ఇంగ్లాండు, తదితర దేశాలలో జన్మిస్తారని బాబా స్పష్టం చేశారు.

*****

ఈ దేశంలో జన్మించడమే ఎంతో అదృష్టమని బాబా ప్రకటించారు.
అవతారుని కాలంలో, ఆయన సన్నిధిలో ఉన్నవారు,
నేటి తరంలో, నిరంతరం అవతారుని నామస్మరణలో
సేదతీరే వారెందరో ఉన్నారు కదా!!
వారెంత అదృష్టవంతులో !! !!

# తెలుగు సహవాస్

1955 నవంబరు 11, శుక్రవారం, మధ్యాహ్ననికి బాబా ప్రేమికులందరూ అహ్మద్‌నగర్ చేరుకున్నారు. మెహెరాబాద్‌లో తెలుగు సహవాస్ బాబా సమక్షంలో ప్రారంభమైన రోజు. తెలుగువారు మొత్తం 181 మంది ఈ సహవాస్‌లో పాల్గొన్నారు.
ఆ రోజు బాబా ప్రేమికులతో నగర్ రైల్వేస్టేషన్ **అవతార్ మెహెర్‌బాబాకు జై జై** నినాదాలతో మారుమ్రోగింది. అహ్మద్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సుల్లో బాబా ప్రేమికులందరూ మెహెరాబాద్‌కు చేరుకున్నారు.
దారి పొడుగూతా కూడా **అవతార్ మెహెర్‌బాబా జయ జయ నాదాలు** బాబా ప్రేమికులు చేస్తూనే వున్నారు. ఆనాటి ఆ వాతావరణాన్ని వర్ణించడానికి మాటలకందదు.
అంతక్రితం వారం రోజులపాటు మెహెరాబాద్‌లో గుజరాతీ ప్రేమిక సహవాస్ జరిగింది. ఐతే, ఆ సమయంలో ఈ మాదిరి వాతావరణం లేదని కొందరి అభిప్రాయం.
వారందరూ బాబా ఎదుట మౌనంగా కూర్చున్నారు.
అవతారుని యెడల వారికి గల ప్రేమ అంతర్లీనంగానే ఉండింది.
తెలుగువారి మాదిరి **గల గల** స్వభావం కాదు వారిదని నాటి పెద్దలు అభిప్రాయపడతారు.
పలు తెలుగు ప్రాంతాల నుండి వచ్చిన వారందరికీ మెహెరాబాద్‌లో భోజన వసతి ఏర్పాట్లు మండలివారు స్వయంగా చేశారు. మండలి సభ్యుడైన పెండూ భోజనాల ఏర్పాటు విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాడు. .
తెలుగువారు భోజన ప్రియులు.
అంతేకాదు ఉత్తరాదివారి మాదిరి రొట్టెలు తినడానికి ఇష్టపడరు.
వరి అన్నం, పప్పు, సాంబారు, పెరుగు వీరి భోజనంలో తప్పనిసరిగా వుండాలి.
మెహెరాబాద్ వారికి ఈ సంగతి బాగా తెలుసు.
అందుకనే తెలుగువారి వంటకాలు తయారీ కోసం సహవాస్ కంటే ఒకరోజు ముందుగా ఏలూరు నుండి డాక్టర్ కనకదండితో పాటు కొంతమంది వంటవారి బృందం మెహెరాబాద్‌కు చేరుకుంది.
వారందరూ నవంబర్ 11 నుండి వారి పనుల్లో నిమగ్నమయ్యారు.
బాబా సమక్షంలో తెలుగువారందరూ
మాటల్లో వర్ణించలేనంత దివ్యానుభూతిని అనుభవించారు.
వారందరూ ఎంతో అదృష్టవంతులు.
ఆ మర్నాడు అంటే నవంబర్ 12 ఉదయం 7.40 నిముషాలకు మెహెర్‌బాబా మెహెరాజాద్ నుండి కారులో మెహెరాబాద్‌కు చేరుకున్నారు.

బాబా కారు రాక మునుపే
బాబా ప్రేమికులందరూ మండలి హాలు బయట
ఒక ఫర్లాంగు దూరంలో బాబాకు స్వాగతం పలికేందుకై నిలుచున్నారు.
బాబా కారు కనపడగానే జయ జయ నాదాలు మిన్నుముట్టాయి.
బాబా మండలిహాలులో కూర్చోగానే ప్రతి ఒక్కరూ ఖరీదైన పూలదండలను
బాబా మెడలో వేశారు. ఈ సమయంలో బాబా చతురోక్తులతో నవ్వుతూ కన్పించారు.
ప్రతి ఒక్కరికీ ఆలింగనం ఇచ్చారు.
నన్ను నెమ్మదిగా కౌగిలించుకోండి,
లేదంటే నా ప్రక్కటెముకలు విరిగి పోగలవు అని నవ్వుతూ అన్నారు.
ఎత్తుగా, లావుగా బలంగా వున్న ఒకరిని పట్టుకుని,
ఏమీ నీవింత నీరసంగా ఉన్నావన్నారు బాబా.
డాక్టర్ ధనపతిరావు నాయుడు, తాడేపల్లిగూడెం, ఆయనికి అప్పటికే 70 సంవత్సరాల
వయస్సు వుంది. బాబాని ఆలింగనం చేసుకునేందుకు బాబా సమక్షంలోకి వచ్చినప్పుడు,
బాబా ఆయనతో మాట్లాడుతూ నీవు కుర్రవాడిలా కనపడుతున్నావ్.
ఏమిటీ రహస్యం? అని నవ్వుతూ పరామర్శించారు.
ఆ రకంగా నవ్వుతూ తుళ్ళుతూ బాబా సమక్షంలో ఆనాటి వాతావరణం
ప్రశాంతంగా వుంది.
బాబా ప్రేమికుడు పండోబా ఆదీ సీనియర్‌తో కలిసి వచ్చాడు.
అతను ఇంగ్లీషులో బాబాను స్తుతిస్తూ ప్రార్ధనలు చదివి,
బాబా పాదాలకు నమస్కరించాడు.
బాబా తన పాదాలు తాకవద్దని, తనకు పాదాభివందనం కూడా చేయొద్దని
ఎన్నోమార్లు చెప్పాను కదా అని పండోబాకు బాబా గుర్తుచేశారు.
పండోబాను పరిచయం చేస్తూ, అతను ప్రేమాశ్రమ స్కూల్లో చదువుకున్న
విద్యార్ధి అని బాబా తెలుగువారికి పరిచయం చేశారు.
కుప్పు స్వామి అనే మరో ప్రేమికుడు కాషాయ వస్త్రాలు ధరించి ఆనాడు బాబాను
దర్శించుకున్నాడు. ఈ వేషం ఎప్పట్నించని ఆతడిని బాబా అడిగారు.
ఈ ఒక్కరోజుకే బాబా అని జవాబిచ్చాడు.
కాషాయం దుస్తులు మానసిక ప్రశాంతతకు,
హృదయ పరిశుభ్రతకు ప్రతీకలు.
అలాంటిది,
ఏదో డాబుసరిగా కాషాయ దుస్తులు ధరించడం మంచిది కాదన్నారు బాబా.
అ పిదప కొత్తగా ఈ సహవాస్ కార్యక్రమానికి హాజరవుతున్న కొంతమంది తెలుగువారిని

డాక్టర్ ధనపతిరావు నాయుడు పేరు పేరునా బాబాకు పరిచయం చేశాడు.
ఆనాడు ధనపతిరావు గారి మాటల్లో కొంత స్పష్టత కొరవడింది.
బాబా అదే అడిగారు.
ఏమీ! నీ గొంతులో ఏదో మార్పు కనిపిస్తోందన్నారు.
ఇంతలో ప్రక్క నుండి, అవును బాబా !!
ఆయన క్రొత్తగా నోట్లో పళ్ళు కట్టించుకున్నాడని చెప్పాడు.
అందుకే ఆయన మాటల్లో కొంత తేడా కనపడుతోందన్నాడు.
కేరళ నుండి వచ్చిన ఒకరిద్దరు ప్రేమికుల్ని క్రిష్ణాజీ బాబాకు పరిచయం చేశాడు.
అయితే వారు తమతో పూలదండ కూడా తీసుకురాలేదని
వారికి దైవ భక్తి గురించి బొత్తిగా తెలియదన్నాడు క్రిష్ణాజీ.
పూలదండలు తీసుకురాలేకపోయినవారు నిరుత్సాహపడొద్దన్నారు బాబా.
ఆ మూల గుట్టలుగా పడివున్న దండలలో నుంచి
మీకు నచ్చిందొకటి తీసుకోమన్నారు.
వారు సంతోషంగా ఒక దండ తీసుకొని బాబా మెడలో వేసి సంతోషించారు.
అంతక్రితం రోజు రాత్రి నిద్ర పట్టనివారు ఎవరైనా ఉన్నారా? అని
బాబా సహవాసీలను ప్రశ్నించారు.
ఒకవేళ జలుబుతో బాధపడుతుంటే వెంటనే తగిన మందుని
డాక్టర్ నీలూ లేదా డాక్టర్ పాద్రీల దగ్గర తీసుకోండని బాబా సలహా ఇచ్చారు.
మీరిక్కడ కొద్దిరోజులు ఉండబోతున్నారు.
కాబట్టి మీ ఆరోగ్యం గురించి తగిన శ్రద్ధ తీసుకోండన్నారు.
నా సమక్షంలో మీరు ఐదు రోజులు ఉండబోతున్నారు.
అందరం ఒక కుటుంబ సభ్యుల్లాగా ఉందాం.
మీ కుటుంబం గురించి, భార్యా పిల్లలు, ఉద్యోగం, మీ హోదా గురించి
అన్నింటినీ సాధ్యమైనంత వరకు మరచిపోయి హాయిగా ప్రశాంతంగా
నా సమక్షంలో ఉండండి. మీ కష్టనష్టాలు, ఇతర సమస్యలు ఏమైనాఉంటే
వాటినన్నింటినీ ఈ సమయంలో మరచిపోండన్నారు బాబా.
ఇక్కడున్నంత సేపు మీ ఇంటిపై ధ్యాస పెట్టొద్దన్నారు.
సమావేశ హాలు బయట సహవాసీల కోసం ఉంచిన
నియమ నిబంధనల బోర్డును క్షుణ్ణంగా చదివారా? అని బాబా ప్రశ్నించారు.
మీకు ముందు వచ్చిన గుజరాతీ బృందం,
ఇక్కడ నాతో వారం రోజులు హాయిగా గడిపారు.
వారికి నేనేమీ ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పలేదు.

వారికి నేను ఏమి చెప్పానో దానినే తిరిగి మీకూ,
మీ తర్వాత వచ్చే బృందాలకు చెప్తాను.
మండలి ప్రేమికుడు రమ్జూ కొన్ని విషయాలు మీ కోసం సిద్ధం చేస్తున్నాడన్నారు..
మనకు ఈ దేహం ఉన్నంత వరకూ కొన్ని ఆరోగ్య సంబంధ సమస్యలు తప్పవు.
ఆత్మ జ్ఞానాన్ని పొంది ఎవరైతే తిరిగి సాధారణ చైతన్యాన్ని పొందుతారో
వారికి ఈ శారీరక బాధలు వుండవు.
మెహెర్‌బాబా కూడా జలుబుతో బాధపడతాడు.
ఎందుకంటే నేను ఉన్నతస్థాయి నుండి ఈ స్థూల ప్రపంచంలో
స్థూల చైతన్యాన్ని అనుభవిస్తున్నాను కాబట్టి ఈ శారీరక కష్టాలు అనుభవిస్తునానన్నారు.
మీకేదైనా చిన్నా చితకా బాధలు వుంటే దగ్గర్లో వున్న డాక్టర్‌కు చెప్పండి,
తగిన మందులు తీసుకోండి.
ఈ విషయంలో ఏమాత్రం బిడియపడవద్దన్నారు.
విజయవాడ నుంచి వచ్చిన రైల్వే ఉన్నతోద్యోగి,
బాబా ప్రేమికుడైన మాణిక్యాలరావు గారిని బాబా చూపిస్తూ,
ఏమీ నీవింత నీరసంగా వున్నావన్నారు.
నాకు నిన్నరాత్రి బాగా నిద్రపట్టలేదని బాబాతో అన్నాడు.
అలాగా! నిన్నరాత్రి నిద్ర పట్టని వాళ్ళని లేచి నిలబడమని చెప్పినప్పుడు
నీవెందుకు నిలబడలేదన్నారు బాబా.
ఇలాంటి చిన్నచిన్న సమస్యలను నీ ముందు చెప్పడానికి ఇష్టం లేకనే చెప్పలేదు బాబా,
అని సవినయంగా  ఆయన జవాబిచ్చాడు.
ఈ దేహంతో అనేక రుగ్మతలొస్తాయి.
అది సహజం.
ఇందుకు అవతారునికి కూడా మినహాయింపు లేదు.
ఈ విషయం పాశ్చాత్య ప్రేమికులకి తెలియక,
ఒక సందర్భంలో ఇంగ్లాండులో పర్యటనలో ఉన్నప్పుడు,
ఒక రోజు రాత్రి పలుచని దుస్తులతో వున్న నన్ను,
ఫోటో తీసుకుంటామని చెప్పి
వారు నన్ను మంచు వానలో నిలబెట్టారు.
నేను దైవాంశ సంభూతుడిని కాబట్టి,
నాకు జలుబు చేయదని వారు ఊహించారని బాబా అన్నారు.
1952లో జరిగిన కారు ప్రమాదం గురించి బాబా ప్రస్తావించారు.
అమెరికాలో ఒక్లొహామాలో జరిగిన కారు ప్రమాదంలో

తన కాలు విరిగిన సంగతి తెలిపారు.
నీవు అవతార పురుషుడివి కదా!
ముందుగా ఆ ప్రమాదాన్ని ఊహించి,
ప్రమాదాన్ని తప్పించి ఉండొచ్చు కదా అని
వారెవ్వరూ భావించ లేదు.
కనీసం ఆ ప్రమాదాన్ని బాబా ముందుగా ఊహించలేదని
వారు నన్ను తప్పుపట్టలేదు.
సరికదా వారు నా యందు అత్యంత నమ్మకంతో, ప్రేమతో ఉన్నారు.
ఆ సమయంలో అమెరికాలో డాన్‌స్టీవెన్సు నన్ను దర్శించుకున్నాడు.
అవతారుషుడివై వుండి భువి నుండి దిగివచ్చిన
సాక్షాత్తు పరమాత్ముడికి కారు ప్రమాదంలో కాలు విరగడమేమిటని కూడా
వారు సందేహించ లేదు.
శ్రీకృష్ణుడి కాలికి బాణం తగలడం ద్వారా మరణించాడు.
ఇది నిజమే కదా అన్నారు బాబా.
ఈ సహవాస్‌లో బాబా సమక్షంలోనే వున్న
డాన్‌స్టీవెన్సును ప్రశ్నిస్తూ నా కాళ్ళకు సిమెంటు కట్టు చూసి
నీవేమనుకోలేదా ? అని బాబా ప్రశ్నించారు.
నాకలాంటి ఆలోచనే రాలేదని డాన్ స్పష్టం చేశాడు.
బాబా ఇంకా ఇలా అన్నారు.
నా దివ్యాధికారంతో చెప్తున్నాను.
బాగా ఆలకించండి.
నేను అన్నిటా అంతటా ఉన్నాను. అందరిలో ఉన్నాను.
ఈ సృష్టిలో ఉన్నది కూడా నేనొక్కడినే. ఇదేదో ఓ మహా జ్ఞాని మాటలనుకోవద్దు.
ఒక తాత్వికవేత్త చెప్పే మాట అనుకోవద్దన్నారు. మీరు తరచు మెహెర్‌బాబాకి జై,
మెహెర్‌బాబాకి జై అని బిగ్గరగా అరుస్తూ మీ సమయాన్ని వృధా చేస్తున్నారన్నారు.
ఐదు రోజుల క్రితం సాకోరి నుండి గోదావరి మాయి ఇక్కడికి వచ్చినప్పుడు
నేను ఆమెతో ఈ మాటలే చెప్పాను. నేను పురాణ పురుషుడను. దేవదేవుడను.
నా నామం స్మరించండి. నా గురించి మీ నిత్య జీవనంలో అనుక్షణం గుర్తుంచుకోండి.
ఇదే మాటల్ని మీకే కాదు, ఆధ్యాత్మిక పథంలో ఉన్నత స్థితిలో ఉన్న సాధు సజ్జనులకు
కూడా చెప్తున్నాను. ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో ఉన్న ఒక సాధువు **కమ్ము బాబా**
ముంబాయిలో ఉంటాడు. అతను నన్ను అమితంగా ప్రేమిస్తాడు, ఆరాధిస్తాడు.
అతను ఇటీవల ఒక ఉత్తరం నాకు రాశాడు.

ఆ లేఖలో తనను త్వరలో బంధ విముక్తుడిని చేయమని
భగవంతునిలో ఐక్యం కల్పించమని నన్నెంతగానో వేడుకొన్నాడు.
నేను అతనికి జవాబుగా ఒకటే చెప్పాను. అదేమంటే, నిరంతరం నా నామస్మరణ చేయమన్నాను. ముఖ్యంగా అతను శరీరం వదిలే సమయంలో నా నామం స్మరించడం మరచిపోవద్దని హెచ్చరించాను. భగవంతుడు ఒక్కడే. ఉన్నది నేనొక్కడినే.
నేను భగవంతుడను. పురాణపురుషుడను. ఈ మాటలను మీరు విశ్వసించండి.
ఏసు క్రీస్తు ఏమన్నాడో చెబుతూ – **నేనూ, నా తండ్రి ఒక్కరే అన్నాడు.**
'నేను' అంటే ఏమిటి ? అని బాబా ప్రశ్నించారు. అవతార పురుషుడిగా నేను చెప్పే ఈ **'నేను'** మీరందరూ సహజంగా వాడే **"నేనుకీ"** చాలా తేడా వుంది.
అవతార పురుషుడికి ఎలాంటి సంస్కారాల బంధనం ఉండదు.
అదే మీరందరు చెప్పే "నేనుకి" అనేక సంస్కారాలు, బంధనాలు అంటిపెట్టుకుని ఉంటాయని, బాబా స్పష్టం చేశారు. భగవంతుడు ఒక్కడే సత్యం. నేను భగవంతుడను.
మీరు చూస్తున్న ఈ భౌతిక ప్రపంచం ఒక పెద్ద మిధ్య.
సుమారు నూరు సంవత్సరాల లోపు మీరందరూ మీ మీ శరీరాలను వదలిపెడతారు.
అంటే చనిపోవడం జరుగుతుంది. ఐనప్పటికీ మీ ఆత్మలు చిరంజీవులుగానే వుంటాయి.
మీ శరీరం గురించి ఆలోచించకండి. నా నామం స్మరించండి.
మీ చివరి క్షణాలలో నా నామం స్మరించడం మరచిపోకండి.
భౌతికంగా నన్ను ఈ శరీరంతో మీరు చూస్తున్న **"నేను" నేను కాదు.**
నా నిజ స్వరూపాన్ని మీరింకా చూడవలసి వుంది.
నా నిజ స్వరూపాన్ని మీరు దర్శించినప్పుడు
మీ భవబంధనాలన్నింటి నుండి విముక్తులవుతారు. పది లక్షల మందిలో ఏ ఒక్కనికో నా నిజ స్వరూప దర్శనం లభిస్తుంది.
కొన్ని లక్షల మందిలో ఏ ఒక్కనికో బ్రహ్మైక్యం లభిస్తుంది.

**హాఫీజ్ ఏమన్నాడంటే**
**కొన్ని లక్షలమందిలో ఏ ఒక్కడో**
**తమ దేహాన్ని భగవంతుని ప్రేమకు అంకితం చేస్తాడు.**
**భగవంతుని పాదధూళిగా మారి**
**తన జీవితాన్ని భగవంతునికి అర్పితం చేస్తాడు.**
**అలాంటి వానికే బ్రహ్మైక్యం లభిస్తుంది.**
**ఇదీ హాఫీజు ఉవాచ అని బాబా అన్నారు.**



# పంచగని

- మల్లాది కృష్ణానంద్.

**పంచగని** సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో ఉంది. ఎత్తైన ఐదు కొండల నడుమ ఉన్న చిన్న గ్రామం. పంచగనికి సుమారు 20 కిమీ దూరంలో మహాబళేశ్వర్ వుంది. పంచగని జనాభా 14 వేలు (2011). మహాబళేశ్వర్ జనాభా కూడా సుమారుగా 13 వేలు పై చిలుకు ఉంటుంది. పంచగని, మహాబళేశ్వర్‌లు రెండూ కూడా పురాతన నగరాలు. ప్రముఖ హిల్ స్టేషన్లు. చూడచక్కని పర్యాటక స్థలాలు. ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు, పురాతన దేవాలయాలతోపాటు కృష్ణానది పుట్టిన ప్రాంతాన్ని ఇక్కడ దగ్గరగా చూడొచ్చు.

మెహెర్‌బాబా ప్రేమికులకు పంచగని ఒక చక్కని ఆధ్యాత్మిక కేంద్రం.
ప్రతి ఒక్క బాబా ప్రేమికుడు పంచగని ఒక్కసారైనా తప్పక దర్శించాలి.
ఈ పాటికే చాలామంది బాబా ప్రేమికులు, ముఖ్యంగా తెలుగువారు పంచగని సందర్శించారు. పంచగనిని ఇంతవరకూ చూడనివారి కోసం ఈ వ్యాసం ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించండి.

పంచగని, మహాబళేశ్వర్‌లు మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉన్నాయి. బాబా ప్రేమికులు ఇక్కడకు వెళ్ళాలనుకునేవారు ముందుగా పూణే వెళ్ళి, అక్కడ నుండి పంచగని చేరుకోవచ్చు. పూణే నుండి పంచగని దూరం 130 కిమీ. సుమారు 3 గంటల ప్రయాణం. పంచగని నుండి మహాబళేశ్వర్ దూరం 20 కిమీ. ఉదయాన్నే పూణే నుండి బయలుదేరి పంచగనికి వెళ్ళి, అక్కడ నుండి మహాబళేశ్వర్‌లో రాత్రి బస చేసి ఆ మర్నాడు మహాబళేశ్వర్‌లోని ముఖ్యమైన ప్రదేశాలు చూసుకుని తిరిగి సాయంత్రానికి పూణే చేరుకోవచ్చు. మెహెర్‌బాబా మహాబళేశ్వర్‌ను పలుమార్లు సందర్శించారు.
ఇంతకీ పంచగని ప్రాముఖ్యత ఏమిటి? అని ప్రశ్నించుకుంటే, మెహెర్‌బాబా పంచగనిలో టైగర్‌వ్యాలీ అనే ప్రాంతంలో ఒక చిన్న గుహలో ఏకాంతవాసం చేసారు.

పులులు,సింహాలు ఆ ప్రాంతంలో సంచరిస్తాయి కాబట్టి ఆ ప్రదేశాన్ని టైగర్‌వ్యాలీ అని స్థానికులు పిలుస్తారు. బాబా ఆదేశాల మేరకు ఇక్కడున్న కొండలో చిన్న గుహలాగా





తొలిచారు. ఈ గుహ 15x9 అడుగుల సైజులో ఉంది. ఈ గుహలో మెహెర్‌బాబా 1930 మే 15 నుండి 26 దాకా కఠిన ఏకాంతవాసం, కేవలం పాలు తీసుకుని గడిపారు. **ప్రపంచ శాంతి కోసం తాను ఏకాంతవాసం చేపట్టానని బాబా ప్రకటించారు. అప్పటికి భారత దేశానికి స్వాంతంత్ర్యం రాలేదు. సాతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతున్న రోజులవి.** ఆ రోజుల్లో కరెంటు, రవాణా సౌకర్యాలు, కనీస సౌకర్యాలు ఏమీ లేని రోజుల్లో ఈ భయంకర కొండ శ్రేణుల్లో అవతారుడు యావత్తు మానవాళి కోసం ఉపవాసం-ఏకాంతవాసం చేశాడు. ఆనాడు పంచగని జనాభా కనీసం వెయ్యిమందైనా వున్నారో? లేదో.

2014 జూలైలో మధ్యాహ్నం 12 గంటలప్పుడు టైగర్‌వ్యాలీలో బాబా వారు ఏకాంతవాసం వున్న గుహను చూడ్డానికి వెళ్ళాం. నేటి రోజుల్లోనే, పగలు వెళ్ళడానికే అసాధ్యంగా వుందీ ప్రదేశం. ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం బాబా ఇక్కడ ఏకాంతవాసం చేసిన సమయంలో ఈ ప్రాంతం ఎంత భయానకంగా ఉండిందో ఊహించుకోవచ్చు. నేడు పంచగని గుహలో బాబా ఫోటోను వుంచారు. గుహకు ముందుభాగంలో ఇనుప గ్రిల్ వుంది. ఈ గ్రిల్‌కు ఒక చిన్న కిటికీ వుంది. దానికి తాళం వేసి వుంచారు.






ఈ తాళం స్థానిక బాబా ప్రేమికులు డాక్టర్ వై. వాసుదేవ్ వద్ద వున్నాయి. ఈ కిటికీ ద్వారానే ఎవరైనా లోనికి వెళ్ళాలి. అలా మేం లోనికి వెళ్ళి కొద్దిసేపు ప్రార్థనలు చేశాం. గుహ దాకా వెళ్ళడానికి సుమారు రెండున్నర అడుగుల వెడల్పు గల దారి మాత్రం ఉంది. గుహ దాకా వాహనాలు వెళ్ళవు. ప్రధాన రహదారి నుండి కొన్ని నిముషాలు కాలినడకన వెళ్ళాలి. జూన్ నెల నుండి జనవరి నెలాఖరు దాకా ఇక్కడ వాతావరణం చల్లగా, మధ్య మధ్యలో వాన జల్లులు, చల్లని గాలులతో నిండి వుంటుంది. ఒక్కొక్క సమయంలో కుండపోత వానలుంటాయి. పంచగనిలో తీవ్ర ఎండాకాలంలో కూడా పెద్ద ఎత్తున వానలు కురిస్తాయి. పెద్ద అటవీ ప్రాంతం. ఇక్కడికి వెళ్ళాలనుకుంటే వేసవి కాలం ఉత్తమం. బాబా ప్రేమికులందరికీ బాబా ఏకాంతవాసం చేసిన గుహ చాలా పవిత్రమైంది. ఆ గుహలో కొన్ని క్షణాలు మౌనంగా

వుండాలనుకోవడం సంతోషం. గొప్ప ఆధ్యాత్మిక శక్తి ఈ ప్రాంతంలో వుందని

ప్రత్యేకంగా చెప్పవల్సిన పనిలేదు. మరో విశేషం ఏమంటే,

బాబా గుహ వున్న ప్రాంతం

మినహాయించి ఆ



చుట్టుప్రక్కలంతా కాంక్రీట్ భవనాలతో అభివృద్ధి చెందింది.
ఏ కారణంగానో ఈ గుహ వున్న ప్రాంగణం మాత్రం గత కొన్నేళ్ళలో పలువురి చేతులు మారినా, ఈ స్థలం నేటికీ చెక్కుచెదరలేదు. ఎలాంటి కాంక్రీటు పనులు జరగలేదు. నేటికీ వర్జిన్ భూమిగా కనపడుతోంది. బాబా ఈ ప్రాంతాన్ని భావితరాలవారి కోసం బధ్రపరచాలని, ఆ మేరకు ఈ ప్రాంతాన్ని కొనుగోలు చేయాలనుకున్నారు. కానీ ఆ కార్యం సఫలం కాలేదు.

## సతారా

పూణే నుండి నాల్గవ నంబరు జాతీయ రహదారిలో సుమారు 60 కిమీ దూరంలో సతారా పటట్టణం వుంది. సతారా జిల్లా కేంద్రం కూడా. సతారాకు చేరుకునే మునుపే సుమారు 10 కిమీ ముందర ఉడ్‌తారా అనే చిన్న గ్రామ సమీపంలో మెహెర్‌బాబాకు రెండవసారి కారు ప్రమాదం జరిగిందన్న సంగతి బాబా ప్రేమికులకు తెలుసు. ఉడ్‌తారా ప్రధాన రహదారికి ఒక ప్రక్కగా వుంది. పంచగనికి వెళ్ళేవారు ముందుగా ఉడ్‌తారాలో బాబావారి కారుకి జరిగిన ప్రమాద స్థలాన్ని సందర్శిస్తారు. ఈ ప్రాంతంలో ఒక స్మారక స్థూపం నిర్మాణం త్వరలో చేపట్టనున్నారని, ఇందుకు తగిన స్థలం కొనుగోలు జరిగిందని స్థానికులు చెప్పారు. మహాబళేశ్వర్, పంచగని, ఉడ్‌తారాలను వీలున్న బాబా ప్రేమికులు ప్రతి ఒక్కరూ తప్పక చూసితీరాలని మా అభిప్రాయం. పూణే నుండి మహాబళేశ్వర్‌కు బస్సులు, ప్రైవేటు కార్లు అనేకం వున్నాయి. పంచగని లేదా మహాబళేశ్వర్‌లో రాత్రి బస చేయాలనుకునే వారికి సుమారు రూ. 500 నుండి లభించే హెూటళ్ళు అనేకం వున్నాయి. ఈ ప్రాంతంలో ప్రజలు వుండే ఇళ్ళ కంటే హెూటళ్ళే ఎక్కువగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఇకపోతే, దక్షిణాది వంటకాలకు కొదవ లేదు.

# పంచగని విశిష్ఠత

**(LORD MEHER VOLUME -II,(Latest edition) P 945-965 ఆధారంగా)**

**మెహెర్‌బాబా 1930 ఏప్రిల్ 2న పంచగని అటవీ ప్రాంతంలో ఏకాంతవాసం చెయ్యాలని వుందని ప్రకటించారు.** తగిన ఏర్పాట్లు కోసం అదే రోజున బాబా మండలి సభ్యుడైన కాలేమామను పంచగనికి పంపారు. ఆ సమయంలో బాబా నాసిక్ ఆశ్రమంలో వున్నారు. అంతక్రితం మార్చి 23న బాబా తొలిసారిగా పంచగని సందర్శించారు. అక్కడ స్థానిక హైస్కూలు ప్రిన్స్‌పాల్ కె.యం. పండిట్‌జీ తదితరులు బాబాను దర్శించుకున్నారు. ఆ దరిమిలా బాబా మార్చి 25న మధ్యాహ్నం నాసిక్ తిరిగి చేరుకున్నారు. పండిట్‌జీ ఎవరో కాదు. కాలేమామ యొక్క కూతురు భర్త. కాలేమామ గారి అల్లుడన్నమాట.

ఏప్రిల్ 9న, 18 మంది సభ్యులతో కలిసి బాబా పంచగనికి ఒక ప్రత్యేక బస్సులో వెళ్ళారు. ఈ బృందంలో కొంతమంది మెహెరాశ్రమం బాలురు కూడా వున్నారు. పండిట్‌జీ బాబా బృందానికి ఆతిథ్యం ఇచ్చాడు. ఏప్రిల్ 10న పంచగనిలోని అటవీ ప్రాంతంలో టైగర్‌వ్యాలీ దగ్గర ఒక ఎత్తైన కొండప్రాంతాన్ని బాబా ఎంపిక చేశారు. అక్కడ కొంతభాగం తొలిచి గుహ ఏర్పాటుచేయనున్నారు. ఈ ఏర్పాట్లు ఒక నెలరోజుల్లో పూర్తి కావాలని బాబా ఆదేశించారు. 1930 మే 1 నుండి తాను ఆ కొండ గుహలో ఏకాంతవాసం ప్రారంభిస్తానన్నారు. నాతోపాటు మరో నలుగురు మరోచోట అంటే మెహెరాబాద్, నాసిక్‌లలో ఏకాంతవాసం గడపాలన్నారు. మరో నలుగురు కొండ గుహకు ఇరు ప్రక్కల పగలు–రాత్రి కాపలా వుండాలన్నారు. నాతోపాటు ఈ ఎనిమిది మంది కేవలం పాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలన్నారు. తన కేదైనా సమాచారం తెలియజేయాలంటే మండలి సభ్యుడు ఛగన్ ఒక్కనికే అనుమతి వుందని స్పష్టం చేశారు. ఈ సమయంలో తాను అక్షర ఫలకం ఉపయోగించనన్నారు. గుహకు ఇరుప్రక్కలా వుండే కాపలా వాచ్‌మెన్‌లను కూడా కన్నెత్తి తాను చూడనన్నారు. అలాగే స్థానికులెవరికీ దర్శనం ఇవ్వనన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు నిషేధం అన్నారు. ఇలా తన ఏకాంతవాసం ఆరు నెలలుపాటు కొనసాగుతుందన్నారు. నేను నా ఏకాంతవాస ఏర్పాట్ల గురించి చర్చిస్తుంటేనే దేశంలో పలుచోట్ల అనేక అలజడులు జరుగుతున్నాయి.

నేను ఏకాంతవాసంలో కూర్చున్న పిదప మరెన్ని సంఘటనలు జరుగుతాయో! మీరు నిశితంగా గమనిస్తుండండని బాబా తన మండలిని హెచ్చరించారు.

హిందూ – ముస్లింల మధ్య ఘర్షణ, హిందువులలో ఉన్నత–నిమ్న కులాల మధ్య

బేధాలు, మత సంఘర్షణలతో దేశం అతలాకుతలమవుతుంది.
రక్తం ఏరులై పారుతుందని బాబా హెచ్చరించారు.
టైగర్‌వ్యాలీ కొండ ప్రాంతంలో చిన్న గుహ త్రవ్వకానికి,
అందులో బాబా ఏకాంతవాసం ఉండటానికి తగిన అనుమతి కోరుతూ
ఏప్రిల్ 11న ఆనాడు పంచగని ప్రాంతాన్ని ఏలుతున్న సావంత్‌వాడీ మహారాజ్
దగ్గరకు బాబా కాలేమామాను పంపారు.
మహారాజ్ ఆధ్యాత్మిక చింతనాపరుడు.
కాలేమామ అభ్యర్ధనను  మహారాజు వెనువెంటనే అంగీకరించాడు.
అంతేకాదు ఆ ప్రాంతాన్ని మెహెర్‌బాబాకు అంకితమిస్తానని ప్రకటించాడు.
ఆ దరిమిలా గుహ త్రవ్వకం పనులు ప్రారంభించారు.
బాబా తరచు ప్రదేశానికి వచ్చి పర్యవేక్షించేవారు.
గత అవతార కాలంలో తాను ఛత్రపతి శివాజీగా జన్మించానన్నారు బాబా.
శివాజీ మిలటరీ క్యాంపు  ఈ ప్రాంతంలో ఉండిందని బాబా అన్నారు.
ఈ గుహ నిర్మాణంలో సిమెంటు, ఇసుక కాంక్రీటు మిశ్రమాన్ని వాడారు.
ఒకరోజున కాంక్రీటు పని అయిపోతుండగా పెద్ద వాన వచ్చే సూచనలు కన్పించాయి.
వాన పడితే అప్పటిదాకా చేసిన సిమెంటు పని వృధా అవుతుందని కాలేమామ
తదితరులందరూ ఆందోళన చెందారు.
ఈ సమయంలో బాబా తన గది నుండి బయటకు వచ్చి ఆకాశం కేసి చూశారని,
ఆ తర్వాత కారు మబ్బులు మటుమాయమయ్యాయని బాబా ప్రేమికులు చెప్తారు.
ఈ ప్రాంతంలో  అననుకూల వాతావరణం, మరి ఇతర కారణాల వల్ల గుహ
త్రవ్వకం ఆలస్యమౌతుందని, ఏప్రిల్ 19న బాబా అసహనం ప్రదర్శించారు.
మే 15 కల్లా త్రవ్వకం పూర్తవుతుందని మీకు నమ్మకం వుందా? అని మండలివారిని
బాబా ప్రశ్నించారు.
ఎవరేమన్నా ముందుగా నిర్ణయించిన తేదీకి పనులన్నీ పూర్తిచేస్తానని కాలేమామ
హామీ ఇచ్చాడు. ఇక్కడికంటే మెహెరాబాద్ కొండల్లో గుహనొకదాన్ని ఏర్పాటు
చేసుకునుంటే సుళువుగా వుండేదేమోనన్నారు బాబా.
బాబావారి మాట పూర్తికాకుండానే పాద్రీ - పదండి ఆ పనినినే చేపడతానన్నాడు.
పాద్రీ కూడా ఇంజనీరు కదా!!
ఐతే, కాలేమామ వారించాడు.  కాలేమామ తనపై భరోసా ఉంచమన్నాడు.
దాంతో బాబా ఈ పనులు పూర్తయ్యే దాకా ముంబాయి వెళ్ళొస్తామన్నారు.
ఏప్రిల్ 26 మండలితో కలిసి బాబా ముంబాయికి వెళ్ళారు.
తన ప్రేమికులను సందర్శించారు.

అనంతరం ఏప్రిల్ 29న పంచగనికి తిరిగి వచ్చారు.
మే ఒకటిన మహాబలేశ్వరం వెళ్ళారు.
అక్కడ వున్న పురాతన దేవాలయాలను సందర్శించారు. పంచగనిలో పనులు చురుకుగా సాగుతున్నాయి. మండలివారందరూ ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.
1930 మే 15 రాత్రి 10 గంటలకు బాబా పంచగని గుహలో ప్రవేశించారు. దాదాపు అదే సమయంలో మెహెరాబాద్‌లో మండలి సభ్యులందరూ వారివారి గదుల్లో ఏకాతవాసం ఉన్నారు. ఈ మేరకు బాబా ముందుగానే వారికి తగిన ఆదేశాలు ఇచ్చారు. బాబా ఈ గుహలో ఏకాంతవాసం ఉంటున్నా తరచూ బయటకు వచ్చి తన మండలివారిని కలిశారు. ఐతే, అక్టోబరు 20 నుంచి మాత్రం బాబా తన ఏకాంతవాసాన్ని మరింత తీవ్ర కఠినతరం చేశారు. బాబా గుహకే పరిమితమయ్యారు.
బయటకు రాలేదు. గుహ సమీపానికి మండలివారిని కూడా అనుమతించ లేదు. స్థానిక గ్రామస్తులను గుహ ప్రాంగణం చూడటానికి కూడా అనుమతించకపోవడంతో, స్థానికంగా అలజడి మొదలయ్యింది. బాబావారిని ఎలాగైనా చూడాలన్న ఉత్సుకత స్థానికులలో అధికమయ్యింది. దాంతో వారు దగ్గర్లోని కొండలెక్కి బాబావారిని దర్శించుకునే ప్రయత్నం చేశారు. అది మే మాసం. తీవ్ర ఎండాకాలం.
ఐనా కూడా పంచగనిలో చల్లని గాలులతో చల్లగా వుంది.
పర్యాటకులకు అనువైన కాలం. ఈ సమయంలో ఇక్కడ పర్యాటకుల రద్దీ ఎక్కువగా వుంటుంది. దీనికి తోడు మెహెర్‌బాబా ఆ గుహలో సజీవ సమాధి అవుతున్నారన్న పుకార్లు షికారు చేశాయి. అంతటి ఎండా కాలంలోనూ, పంచగనిలో రాత్రిళ్ళు ఎడతెరిపిలేని వానలు కురిసాయి.
ఇన్ని అననుకూల పరిస్థితుల దృష్ట్యా మే 26 అర్ధరాత్రి 12.30కు బాబా గుహ బయటకు వచ్చి, ఉన్నఫళంగా మెహెరాబాద్‌కు వెళ్ళిపోదామన్నారు.
ఆ అర్ధరాత్రిపూట బస్సులు, కార్లు ఎక్కడ దొరుకుతాయి.
కనీసం ఎడ్లబండి కూడా అలభ్యం. దాంతో బాబా,ఆయనతోపాటు గుహ సమీపంలో ఏకాంతవాసం వున్న మండలివారందరూ ఆ కారడవిలో కాలిబాట పట్టారు.
సుమారు 4 గంటలు అలా నడుచుకుంటూ సుమారు 20 కి.మీ. నడచి, **వాయ్** అనే ప్రాంతానికి చేరారు. పూణే – పంచగని గ్రామాల మధ్య వాయ్ గ్రామం ఒక జంక్షన్ లాంటిది. పంచగనిలోనే వున్న కాలేమామ తదితర మండలివారిని ఆ మర్నాడు నింపాదిగా మెహెరాబాద్‌కు రమ్మనమని బాబా కబురు పంపారు.
అలాగే, పండిట్‌జీకి మెహెర్‌బాబా అత్యవసర పనిమీద మెహెరాబాద్ వెళ్తున్నారని కబురు పంపారు. ఆ కొండ గుహలోనికి ఎవరినీ అనుమతించ వద్దని, తాళం వేసి వుంచమని ఆదేశించారు. ఆ సమయంలో బాబాకు తీవ్ర పంటి నొప్పితో బాధపడ్డారు.

పూణే నుండి సదాశివపటేల్ ఒక అద్దె బస్సు తీసుకుని మధ్యాహ్నం 2.30కు వాయ్ గ్రామానికి వచ్చాడు. అందరూ ముందుగా పూణే వెళ్ళి, అక్కడి నుండి రాత్రి 9 గంటలకు మెహెరాబాద్ చేరుకున్నారు. అనంతరం మెహెరాబాద్‌లో వాటర్‌ట్యాంకు క్రిందవున్న గదిలో బాబా తన ఏకాంతవాసం కొనసాగించారు.

1936లో బాబా ప్రేమికుడు ప్లీడర్‌ను పంచగని గుహలో కొంతకాలం ఏకాంతవాసం ఉండమని బాబా ఆదేశించారు.

1937 మార్చిలో గ్యారెట్ ఫోర్ట్, శామ్ కోహెన్, అనే పాశ్చాత్య ప్రేమికులు బాబా ఆదేశాల మేరకు రెండ్రోజులు పంచగని గుహలో ఉన్నారు. అమెరికన్ ప్రేమికురాలు ఎలిజబెత్ ప్యాటర్‌సన్ పంచగని గుహలో తానూ ఉంటానని ఉత్సాహపడినప్పుడు తగిన సమయంలో అనుమతిస్తానని బాబా అన్నారు. కొద్దిరోజుల తర్వాత ఆమె తిరిగి తన కోర్కెని బాబా ఎదుట గుర్తుచేస్తే నీవు నేను చెప్పినప్పుడు వెళ్ళదల్చుకున్నావా? లేదా ఇప్పుడే వెళ్తావా? అని బాబా ప్రశ్నించారు.

1938 మే 6న ఎలిజబెత్ ప్యాటర్‌సన్ బాబా అనుమతితో పంచగని గుహలో 12 గంటలపాటు ఏకాంతవాసం ఉన్నారు. ఆ దరిమిలా, 1938 నవంబర్ 30 నుండి డిశంబరు 5 దాకా వాల్టర్ మరియు హేడీలు బాబా ఆదేశాల మేరకు పంచగని గుహలో ఉన్నారు. చివరిసారిగా,

1955లో బాబా తిరిగి పంచగని గుహ సందర్శించారు.

బాబా ఈ గుహ ప్రాంతాన్ని భావితరాలవారి కోసం భద్రపరచాలని, అవసరమైతే ఈ స్థలాన్ని కొనుగోలు చేయాలని భావించారు. ఏ కారణంగానో ఈ కార్యక్రమం నేటి దాకా ఫలప్రదం కాలేదు. 1962లో ప్రాక్ పశ్చిమ సమావేశానికి హాజరైన పలువురు పాశ్చాత్య బాబా ప్రేమికులను బాబా పంచగని సందర్శించమని బాబా ఆదేశించారు. అప్పటి నుండి అడపాదడపా బాబా ప్రేమికులు చాలామంది వారి వీలువెంబడి పంచగని సందర్శిస్తున్నారు. పంచగనిలో డా. వాసుదేవ్ అనే బాబా ప్రేమికులున్నారు. ఆయన వద్దనే ఈ గుహకు సంబంధించిన తాళం చెవి వుంది. వృత్తిరీత్యా ఆయన, ఆయన భార్య కూడా వైద్యులు. గత కొన్నేళ్ళుగా పంచగనిలోనే ఉండి స్థానిక ప్రజానీకానికి వారు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈయన ప్రముఖ బాబా ప్రేమికులు శ్రీ వెంకయ్య (హైదరాబాద్) గారి కుమారుడు. ప్రస్తుతం పంచగని గుహకు సంబంధించిన బాగోగులు డా. వాసుదేవ్ చూస్తున్నారు. పంచగని గుహ చూడాలని వచ్చేవారికి తనవంతు సహాయం తప్పక అందిస్తానన్నారు. ఐతే, బాబా ప్రేమికులు ముందుగా తెలియజేస్తే ఉభయకుశలోపరి అంటారాయన.

**ఆయన అడ్రస్ Dr. Y. Vasudev, M.B.B.S., 125, Hanuman Road, PANCHAGANI, Satara District, Maharashtra - 412 805, ph. 02168 - 240478.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

తన ప్రేమికుల కోసమే పరాత్పర పరమాత్మ అవతరిస్తుంటారని చెప్పారు.
అసలు సిసలైన ప్రేమికులపైనే అవతారుని దృష్టి వుంటుందన్నారు.
వాళ్ళ ఆధ్యాత్మికోన్నతికి దోహదం చేస్తూనే, విశ్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తాడు అవతారపురుషుడు అని మెహెర్ ప్రభువు తెలియజేశారు.
స్వామి రామదాస్‌కి అత్యంత ప్రియమైన శిష్యుడు, అప్పుడు కళ్యాణ్ అన్న శిష్యుడు.
కృష్ణావతార కాలంలో భగవంతునికి అతి దగ్గరవాడు అర్జునుడు, మరి ఏసుక్రీస్తుకు ప్రియాతి ప్రియమైన భక్తులు ఎవరూ లేరా అంటే, ప్రతి అవతార కాలంలోనూ అతి ప్రియమైన భక్తుడు అంటూ ఎవరో ఒకరు వుండాలని లేదని విశదం చేశారు.
జోరాస్టరు ప్రవక్త గురించి ఓ కొత్త సంగతి చెప్పారు.
సుమారు ఆరువేల సంవత్సరాల నాటి అవతారుడు జోరాస్టరు.
ఆయన గురువు హిబ్రూ తెగవాడు. జోరాస్ట్రియన్ల పూజలు, పునస్కారాలు జోరాస్టరు నాటివి కావట. జోరాస్టరు కాలధర్మం చెందిన కొన్ని వందల సంవత్సరాల తర్వాత ఈ పూజలు క్రతువులు వచ్చాయి. వాటి రూపకర్తలు పూజారులు, తదితరులు.
జోరాస్ట్రియన్ మతంలో పూజారులని దస్తూర్‌లు అని పిలుస్తారు.
వీరి చలవ వల్లనే కుస్తీ అనే తంతు మొదలయింది.
కుస్తీ అంటే అదొక ఉపనయన ప్రక్రియ.
బ్రహ్మచర్యానికీ చదువులకీ శ్రీకారం చుట్టడమనవచ్చు.
ఇలానే దస్తూరుల వల్ల వచ్చిన మరో అలవాటు సాద్రా వేసుకోవటం
ఈ అలవాట్లకీ జోరాస్టరు బోధనలకీ సంబంధం లేదు.
జోరాస్టరు కాలంలో ఈ అలవాట్లు, కట్టుబాట్లు లేవు.
జోరాస్టు అవతార పరిసమాప్తి అయిన కొన్ని వందల సంవత్సరాలకి దస్తూరుల పుణ్యమా అని ఈ పూజలు, క్రతువులు, ఆచార వ్యవహారాలు ఏర్పడ్డాయని బాబావారు విశదం చేశారు.
“ఇది పరమ సత్యం” అని పేర్కొన్నారు.

జోరాస్టురుని గొప్ప సూఫీగా అభివర్ణించారు.
సూఫీజానికి తండ్రి జోరాస్టరు అన్నారు.
జోరాస్టరుతో ఆరంభమయింది సూఫీజం, మహమ్మద్ ప్రవక్తతో అంతమయింది అన్నారు.
బాబావారి ఉవాచ పూర్తయేసరికి గడియారం మూడు కొట్టింది.
కొండపైకి వెళ్దాము అన్నారు అందరూ.
బాబావారి వెంట కొండ ఎక్కారు. దారిలో మూడుసార్లు బాబావారు కొండవాగు దగ్గర ఆగారు. ఆ ఆగిన ప్రతిసారీ కాళ్ళు కడుగుకొన్నారు.
ఒకసారి దోసిళ్ళతో నీళ్ళు పట్టించారు పిల్లలకి.
మండలివారు కొండపైన ఎక్కువసేపు లేరు.
మూడున్నరకి కొండ దిగారు.
రావ్‌సాహెబ్, పిల్లలు ఏడింటికి భోజనం చేసి వెళ్ళారు.
బాబావారు ఏకాంతంగా తమ కుటీరంలో కూర్చున్నారు.
బయట గుస్తాద్ గారు, బువాసాహెబ్ కాపలా వున్నారు.
నేటినుంచి గుస్తాద్‌జీ, బువాసాహెబ్, విష్ణులు ఉపవాస దీక్ష పట్టారు.
రోజుకి రెండుసార్లు కాసిని పాలు త్రాగవచ్చుట.
అలానే ఓ పండు తినవచ్చుట.
ఇది బాబావారి ఆదేశం.
అలానే ఛాన్‌గారు, బువాసాహెబ్‌లు ఈవాళ్టి నుంచి మౌనదీక్ష పట్టారు.
ఇదీ బాబావారి ఆదేశమే.
ఆగస్టు 7వ తేదీ నుంచి బాబావారు ఏకాంతవాసంతోపాటు ఉపవాసదీక్ష కూడా పట్టారు. రోజూ కాసిని మంచినీళ్ళు త్రాగేవారు. బాబావారి గదిలో మంచినీళ్ళ బిందెనో కుండనో పెట్టారనుకోవచ్చు మీరు.
అలాంటిది ఏమీ లేదు.
ఆ గదికి ఓ కిటికీ వుందన్న సంగతి పాఠకులకి గుర్తుంది కదా.
కిటికీ తలుపులు ఎప్పుడూ మూసే వుండేది.
బాబావారు కిటికీ తలుపుపై చిటికె వేసేవారు.
బయట కూర్చున్న గుస్తాద్ గారో, బువాసాహెబ్ గారో, ఎవరు కాపలా వుంటే వారు వెంటనే ఓ మంచినీళ్ళ గ్లాసుని కిటికీలో పెట్టేవారు.
కిటికీ తలుపులు బార్లా తెరిస్తే బాబావారు అందరి కంట పడ్తారు కదా.
అలా జరిగితే బాబావారి ఏకాంతానికి భంగం వస్తుంది.
అందుకని, కిటికీ తలుపులు పూర్తిగా తెరిచేవారు కాదు.
అయినా, గ్లాసు లోపల పెట్టటానికి తలుపులు బార్లా తెరవాలా ఏమన్నానా ఏమిటి.

ఇంతకీ ఎన్నిసార్లు మంచినీళ్ళు బాబావారు త్రాగేవారు!
ఇది ఎవరికీ తెలియదు కానీ రోజులో ఒక్కసారే కిటికీ చప్పుడు అయ్యేది.
అదీ ఎప్పుడు పడితే అప్పుడు కాదు సుమా.
రోజూ ఇంచుమించుగా ఒకే సమయానికే బాబావారు నీళ్ళు కావాలనేవారట.
ఈ నీళ్ళు ఎవరు తెచ్చేవారు కొండ మీదకి అంటే, ఆ పని రమ్జూ, ఛాన్జీలది.
వాళ్ళు రోజుకి రెండుసార్లు కొండపైకి వచ్చేవారు.
బాబావారి కోసం మంచినీళ్ళు, గుస్తాద్ – బువాసాహెబ్‌ల ద్వయం కోసం పాలు, పళ్ళ రసం తీసుకువచ్చేవారు. ఇంతకీ మీకు గుర్తుంది కదా.
బాబా కుటీరం దగ్గర వున్నంత సేపూ గుస్తాద్ గారు పెదవి కదపరు.
అది బాబావారి ఆజ్ఞ. వాళ్ళకి ఏదైనా కావాల్సివస్తే, సంజ్ఞల ద్వారా చెప్పేవారు.
చప్పట్లు కొట్టో, కాళ్ళతో నేలమీద కొట్టో, మరోరకంగానో తమ మనస్సులో మాట బయటపెట్టవచ్చు. అవును, అలా చేయవచ్చు తప్పు లేదు.
కానీ, మీ నోటికి తాళం వేస్తే సరిపోదు. కాళ్ళకీ, చేతులకీ సంకెళ్ళు వేసుకోండి.
ఏమాత్రం చప్పుడయినా ఊరుకునేది లేదు అని బాబావారు హెచ్చరించారు.
ఇక్కడనా కుటీరం దగ్గర నిశ్శబ్దం నాట్యం చేయాలన్నారు. మరింకేం చేస్తారు.
చెప్పినట్లే చేస్తున్నారు. మావల్ల మీ విశ్వకార్యక్రమానికి ఏ ఆటంకం రాకుండా మీరే సాయపడండి బాబా అని మనస్సులోనే రోజూ ప్రార్థిస్తున్నారు.
ఆగస్టు 8న రమ్జూ, విష్ణు కొండపైకి రాగానే బాబావారు మీకో పని పురమాయిస్తానన్నారు.
ఏమిటి బాబా అన్నారు వాళ్ళు "వెనక్కి వెళ్ళాల్సిందే మీరు.
అహమ్మద్‌నగర్‌కి బయలుదేరాలి అన్నారు.
వాళ్ళిద్దరు సరేనన్నారు.
అయితే వాళ్ళకి ఆ పని పడలేదు
మరి ఎందుకు బాబా అలా అన్నారు.
బహుశా వాళ్ళని ఆటపట్టించడానికి కావచ్చు.
వాళ్ళ ప్రేమనీ, భక్తినీ పరిక్షించడానికి కూడా కావచ్చు.
ప్రభువు పెట్టే పరీక్షలు ఎన్ని రకాలో పాఠకులకి తెలియనివి కాదు.
విష్ణుకి కొత్త పని పురమాయించారు.
రోజూ ఇక్కడ నా కుటీరం దగ్గర మూడు గంటలు కూర్చోమన్నారు.
కూర్చుని ఏం చేయాలి?
ఇది నీకప్పగించిన కాపలా పని అన్నారు.
అప్పటివరకూ చేస్తున్న పనిని మానేయమన్నారు.
ఇంతకీ ఆ పని ఏమిటి అనే కదా మీ ప్రశ్న,

అయితే చెప్తావినండి. రోజూ భగవన్నామస్మరణ చేయటం విష్ణుకి అప్పగించిన పని. ఆధునిక యుగావతారుడిని సేవించి తరిస్తున్న విష్ణుకు ఈ భగవన్నామస్మరణ దేనికో అనుకోవచ్చు. ఈ ధర్మసందేహం అప్పట్లోనూ మండలివారికి వచ్చిందేమో! తెలీదు. ఒకవేళ వాళ్ళుకూడా విష్ణుకి పురమాయించిన పనికి ఆశ్చర్యపడ్డా పడివుండవచ్చు.
అయితే బాబావారు వాళ్ళ మనోగతాన్ని పట్టించుకోలేదు సరికదా,
ఎన్ని వేలసార్లు భగవన్నామం చేయాలో చెప్పారు.
ఎన్నిసార్లో తెలుసా – పది వేలసార్లట.
అన్నిసార్లే అని ఆశ్చర్యపడ్డారు బాబా ఆజ్ఞ విన్నవారందరూ.
విష్ణుకి మాత్రం అలాగే చేస్తానన్నాడు.
ప్రభువు ఆజ్ఞని తు.చ. తప్పకుండా పాటిస్తున్నాడు ఈవాళ్టి వరకు.
ఇదిగో ఇప్పుడు రాత్రి కాపలా పడింది కాబట్టి ప్రభు నామస్మరణ అవసరం తీరింది.
ప్రభు దర్శనం పగలూ, రాత్రి తన స్వంతమయ్యాక నామస్మరణ అవసరం ఏముంటుంది?
సరే పాద్రీ విషయానికి వస్తే, కొండలు, చలి పడలేదు.
పైపెచ్చు వర్షాలు కూడాను. సుస్తీ చేసింది అనలేము కానీ శరీరం మాట వినటం లేదు అంటే సబబు. అయితేనేం, బాబావారు అప్పగించిన పని ఏదీ మానలేదు.
అందరికీ వంట చేస్తున్నాడు. రోజూ పోస్టాఫీసుకు వెళ్ళి ఉత్తరాలు తెస్తున్నాడు.
మార్కెట్టుకి వెళ్ళి నిత్యావసరాలు కూరలు కొంటున్నాడు.
ఊళ్ళకి కాలినడకన వెళ్ళటం లేదు.
ఊరు ఏమన్నా దగ్గరా? దాపా?
బస్సులో వెడుతున్నాడు. బస్సు నడుపుతున్నది ఎవరు, మన మిత్రుడే.
పాద్రీ మహానుభావుడే.
బస్సుకి డ్రైవరు పాద్రీ అని బాబావారు ఎప్పుడో చెప్పారు కదా.
ఇలా ఊళ్ళ పనులు, వంట పనులు చేస్తున్నావు కాబట్టి నువ్వు కొండపైకి రావద్దులే, వీలు చిక్కినప్పుడు విశ్రాంతి తీసుకో అన్నారు బాబా.
అల్పసంతోషి.
పాద్రీ ఆనందానికి పగ్గాలు లేవు.
అలా అతనొక్కడే రోజూ కొండపైకి వెళ్ళటం లేదు.
ఆ రోజు అంటే ఆగస్టు 8వ తేదీ హార్వాన్ వాసులకి గొప్ప పండగ రోజు.
ఈవాళ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశాము.
మీరంతా వచ్చి బాబావారి విందు భోజనం స్వీకరించండి అని పిలుపు వచ్చింది.
ఆనందంతో పొంగిపోయారు వాళ్ళు.
కలలో కూడా ఊహించ లేదు బాబావారు విందు భోజనం పెడ్తారు అని.

ప్రభువు మా మధ్యన బసచేయడమే మా పూర్వజన్మ సుకృతం.
ప్రభువు ఆతిథ్యం స్వీకరించడానికి ఎంత పుణ్యం చేసుకొన్నామో అనుకొన్నారు.
ఈ గ్రామస్థులకి విందు భోజనం ఏర్పాటు చేయమని బాబావారు
ఎందుకు పురమాయించారు? అలనాడు మండలివారు అడగలేదు.
చిదానందుడు చెప్పలేదు.
అందుకనే ఈ హర్వాన్ విందు చరిత్రలో అంతుచిక్కని ప్రశ్నల జాబితాలో చేరిపోయింది.
హార్వాన్ కొండపైనా, ఆ చుట్టుప్రక్కలా పాముల బెడద ఎక్కువ.
పులులు, ఎలుగుబంట్లు, తోడేళ్ళు ఎన్నో చెప్పలేము.
'అవి ఎప్పుడైనా వచ్చి మీదపడతాయి జాగ్రత్త', అని హార్వాన్ వాసులు
మండలివారిని హెచ్చరించారు. దగ్గర తుపాకీ వుంచుకోండి అని సలహా ఇచ్చారు.
కొండపైన రాత్రి డ్యూటీ బువాసాహెబ్, గుస్తాద్, ఛాన్జీ లది.
కటిక చీకటిలో వరండాపై కూర్చుంటే భయం వేసేది.
దూరంగా పులి అరుపులు వినిపించగానే గుండె గుభేలుమనేది.
ఏం చేయాలో తోచేది కాదు.
బాబావారికి చెప్తామనుకొంటే, ప్రభు ఏమనుకుంటారో!
నాపై నమ్మకం లేదా అని ప్రశ్నిస్తారేమోనని సందేహం.
ఒకవేళ అలా నిలదీస్తే ఏం చెప్పాలి?
అమ్మో! అసలు అటువంటి అవకాశం ఎందుకు రానివ్వాలి.
మెహెరు దేవుడుని మనసా నమ్మి కదా ఇంతదూరం వచ్చాము.
పులి అయితేనేం, పాము అయితేనేం మనకేమిటి భయం
ప్రభువు మన చెంతన వుండగా.
అయినా శివాజ్ఞ లేకపోతే చీమ అయినా కుట్టదంటారు కదా.
ఒకవేళ ఖర్మవశాత్తూ పులి వచ్చి మీద పడింది అనుకోండి,
ఏం చేస్తాం! ఏది ఎలా జరగాలని వుంటే అలా జరుగుతుంది తప్ప
ఏదో ప్రమాదం చుట్టుముట్టుకోబోతోందని కాళ్ళు చేతులు ముడుచుకొని కూర్చోలేము
కదా అనుకొన్నారు మన మిత్రులు.
వీళ్ళకి తుపాకీ ఇవ్వలేదు కానీ రోజూ రమ్జూగారు సాయంకాలం కట్టెలు తెచ్చేవాడు.
వాటితో రాత్రి మంట వేసేవారు.
మంటని చూస్తే పులులు రావని వాళ్ళ నమ్మకం.
బాబావారు వాళ్ళకి ఓ మాట చెప్పారు.
ఎప్పుడూ చేతిలో కర్ర వుండాలి.
తేలు రావచ్చు, పాము బుసకొడుతూ రావచ్చు.

వెంటనే వాటిని చంపేయండి కర్రతో అన్నారు.
మెహెరాబాద్‌లో కూడా బాబావారీ సంగతి చెప్పేవారు.
అందుకనే బుద్ధిగా పెద్ద కర్ర దగ్గర వుంచుకొంటున్నారు.
పులి అరుపులు వినిపించగానే బాబా నామజపం చేసేవారు.
నామం మహిమ వల్ల అనండి, వీళ్ళు వేసుకొన్న నెగళ్ళ వల్ల అనండి
పులి మాత్రం దగ్గరకి రాలేదు.
ఒకరోజున అంటే ఆగస్టు 9వ తేదీన ఏమయిందీ,
ఎప్పటిలా రమ్జూ కట్టెలు తేలేదు.
మర్చిపోయా, ఈవాళ్టికి ఏదోలా సర్దుకుపోండి అన్నాడు.
ఏంచేస్తారు వాళ్ళు హతోస్మి అనుకొన్నారు.
ఈవాళ్ళ మమల్ని కాపాడే భారం బాబావారిదే ననుకొన్నారు.
అయినా రోజూ కాపాడుతున్న బాబావారు ఈవాళ కాపాడరా అనిపించింది.
హమ్మయ్య అనుకొని ఊపిరి తీసుకొన్నారు.
ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ఛాన్జీగారి డ్యూటీ మొదలయింది.
ఎట్టిపరిస్థితుల్లోనూ కూర్చున్న చోటనుంచి కదలకూడదు.
చప్పుడు చేయకూడదు.
పిలిస్తేనే పలకాలి.
అంతే. ఇదీ డ్యూటీ నిబంధనలు.
ఛాన్జీగారికి ఈ నిబంధనలు కంఠోపాఠంగా వచ్చు.
ఏమాటికి ఆమాటే చెప్పాలి.
నిద్రలో లేపినా బాబావారి నియమాలని టకటకా చెప్పేస్తాడాయన.
ఎప్పటిలా ఆవేళ కూడా బాబావారి గదికి దగ్గరగా కూర్చున్నాడు.
కటికి చీకటి. కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడటం లేదు.
దూరంగా పులి గాండ్రించింది.
నక్క గట్టిగా అరుస్తూ పరుగెట్టింది.
ఎటువైపుగా పరిగెత్తింది తెలీటం లేదు.
ఇటు అటు ఎవో జంతువులు పరుగెడుతున్నట్లున్నాయి.
బహుశా పులి వేటకి బయలుదేరింది.
అందుకనే ఆ అరుపులు.
అవి అరుపులు కావు హాహాకారాలు.
భయం వేసింది ఛాన్జీకి.
ధైర్యం తగ్గింది. ఏమీ పాలు పోవటంలేదు.

ఇంతలో అడుగులు చప్పుడు వినిపించింది.
ఆ వస్తున్నది జంతువా? మనుష్యులా!
కాదు, అది కచ్చితంగా జంతువుల అడుగులే ననుకొన్నాడు.
ఇంతలో ఏదో ప్రాకుతున్న అలికిడి, గుండె బేజారు ఎత్తించింది.
అంతే, ఇహ లాభం లేదనుకొన్నాడు.
బాబావారికి మొరపెట్టుకొన్నాడు.
ప్రభు! ఇహ నావల్ల కాదు!
రాత్రల్లా ఇక్కడ కూర్చొలేను.
భయం వేస్తోంది అన్నాడు.
బాబావారు స్వయంగా బదులు పలకలేదు.
తమ సందేశాన్ని అబ్దుల్లా ద్వారా అందించారు.
నీకెందుకో ఈ భయం! నేను నీ దగ్గరగానే వున్నాను అన్నారు.
నీకు అడుగు దూరంలో ఉన్నాను కదా అన్నారు.
నిజమే మరి బాబావారికీ ఛాన్జీకి మధ్యన తలుపు ఒక్కటే అడ్డం.
తలుపుకి ఆవల చూరు క్రింద ఛాన్జీగారు,
ఇటు తలుపుకి లోపల బాబావారు కూర్చున్నారు.
ఒకరిది విశ్వమానవుడికి కాపలా
మరొకరిది విశ్వానికే కాపలా.
ఈ సంగతి ఛాన్జీ గారికి తెలియదా.
తెలుసు. కానీ ప్రాణభయం పట్టుకోగానే బుర్ర పనిచేయటం మానేసింది.
బాబావారి నామస్మరణ స్మృతిపథం నుంచి తప్పుకొంది.
“భయపడకు. అనవసరంగా నీకేమీ కాదు.
ఒకవేళ నువ్వు భయపడుతున్నట్లు పులి వచ్చిందీ అనుకో,
ఏమవుతుంది. ఏమీకాదు.
నిన్ను పులిపై కూర్చోపెట్టి, పులి స్వారీ చేయిస్తాను అన్నారు బాబావారు.
ఈ బాబా మాటల్ని అబ్దుల్లా చెప్తుంటే మన ఛాన్జీ గారికి చెమటలు పట్టేశాయి.
అయ్య బాబోయ్!
పులిపై స్వారీనా!
నన్ను హం ఫట్టు అంటే ఇంకేముంది అనిపించింది.
ఆ మాటే చెప్పాడు.
పులిపై కూర్చోవడం నా తరం కాదు బాబా అన్నాడు.
‘అలా అయితే సరే! నువ్వు పులిపై కూర్చోలేకపోతే పోనీలే!

పులిని నీ వీపుపై కూర్చోమంటాను, అని బాబావారు అన్నారు.
బాబావారు ఆటపట్టించడానికి అంటున్నారో, కోపంతో అంటున్నారో
మన మిత్రుడికి పట్టలేదు. అతనికి పట్టిందల్లా పులి భయం.
అంతే లబోమని అన్నాడు. "నాకు పులీ గిలీ వద్దు.
మన్నించు బాబా.
పులి స్వారీ నేను చేయలేను. నాపై పులి కూర్చుంటుందన్న మాట వింటుంటేనే
పై ప్రాణం పోతోంది. ఇక్కడే ఈ చీకటిలో చచ్చిపోతాను
ఒంటరిగా నీ అనుగ్రహం ప్రసాదించు అంతే చాలు
నా జీవితానికి అన్నాడు.
"సరే నీ ఇష్టం", అన్నారు బాబా వెంటనే.
ఇక్కడే కాశ్మీరులో నువ్వు పోవాలని రాసివుంది కాబట్టి
చావు గురించి భయపడకు అన్నారు.
నీకు అప్పుడే చావు రాదులే అన్నారు.
పులి కాదు దాని అబ్బ వచ్చినా నిన్ను ఏమీ చేయలేవు
ఈ రాత్రికి అని అభయం పలికారు.
నేనిక్కడే వున్నాను కదా!
ఒకవేళ పులి వచ్చిందీ అనుకో. అది నిన్నేమీ చేయదు.
నేను చిటికెవేసేనంటే చాలు పులి పారిపోతుంది.
ఈపని నేను చేస్తాను. చూస్తూ వుండు అన్నారు.
ఛాన్జీ గారికి గుండె దడ తగ్గింది.
హమ్మయ్య అనిపించింది.
కానీ తెల్లవారేవరకూ కాపలా వుండాలి.
అప్పుడు రాత్రి ఒంటిగంట అయింది.
ఇంకో అయిదు గంటలు అంటే,
ఆరింటి వరకూ డ్యూటీ చేయాలి.
ఈపని నా వల్ల కాదు బాబా అన్నాడు.
అతని గోడుని బాబావారు పట్టించుకోలేదు.
తమదైన శైలిలో ధైర్యం నూరిపోశారు.
కాసేపు ఆట పట్టించారు.
ఇంకాసేపు ఆ కథలు ఈ కథలూ చెప్పారు.
బాబావారి మాటలు వింటుంటే భయం వెనక్కివెళ్ళింది.
గడియారం ముల్లు ముందుకి పరుగెత్తింది.

భళ్ళున తెల్లవారింది. అలా ఛాన్జీకి ఆ రాత్రి గడిచింది.
ఆవేళ కాదు బాబావారు హార్వాన్‌లో వున్నన్ని రోజులు
రాత్రి డ్యూటీ తప్పలేదు ఛాన్జీకి. బాబావారు రోజూ ధైర్యం నూరిపోసేవారు.
చీకటి పడ్డప్పటి నుంచి రాత్రి ఒంటిగంట వరకూ బువాసాహెబ్ గారిది డ్యూటి.
పులా, గిలా, నాకేమీ భయం లేదనేవాడు.
గడియారం ఒంటిగంట కొట్టగానే ఆయన డ్యూటీ దిగేవాడు.
ఛాన్జీ కాపలా మొదలయ్యేది.
ఉదయం ఆరింటివరకూ రెప్ప వేసేవాడు కాదు.
డ్యూటి అంటే డ్యూటీయే. బాబావారి దగ్గర ఎవరి పప్పులు వుడకవు.
డ్యూటీలో వున్నంత సేపూ కదలకుండా కూర్చోవాలి. పిలిచినప్పుడే పలకాలి.
ఆగస్టు పదవ తేదీన బాబావారు సూర్యోదయమవుతూనే కొండ దిగారు.
మండలివారున్న ఇంటికి వెళ్ళారు. పిచ్చాపాటీ మాట్లాడుతూ, కాశ్మీర్‌కి గుడ్‌బై చెప్పేద్దామా
అన్నారు. ఇక్కడ 40 రోజులు ఏకాంతవాసం చేస్తామన్నారు.
ఆ మాటేమిటి?
ఏకాంతవాసం మొదలయి రెండున్నర రోజులు అయింది.
మరి అప్పుడే వెళ్ళిపోతే ఎలా?
ఎవరికీ ఏమీ చెప్పాలో తోచలేదు.
కానీ మన ఛాన్జీగారు తడుము కోలేదు. “వెళ్ళిపోదాము బాబా”,
ఇక్కడ ఉండవద్దు బాబా అన్నాడు.
రాత్రి బేజారు ఎత్తిన మనిషి మరేమి అంటాడు కనుక!
హార్వాన్‌లో పాడ్రీపై పనిభారం పెరిగిందని పాఠకులకి తెలుసు కదా.
పనిఎంత ఎక్కువైనా ఎంతో ఓపికతో సర్దుకుపోతున్నాడు.
అతని కార్యదక్షత, సహనం బాబావారికి నచ్చాయి.
భుజం తట్టి శెహభాష్ చెప్పారు.
తమ సంతోషానికి గుర్తుగా దుప్పి కొమ్ములని బహుకరించారు.
మండలివారు నాలుగు రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షని
బాబావారి సమక్షంలో విరమించారు. కాస్తంత ఎంగిలిపడ్డారు.
బాబావారు కూడా ఉపవాసం చేస్తున్నారు కదా.
మజ్జిగ మాత్రం తీసుకొన్నారు. మరి కాసేపు మండలివారితో గడిపి,
బాబావారు మళ్ళా కొండ ఎక్కారు. వెంట రావ్‌సాహెబ్ కదిలాడు.
అతనితో వుంటున్న పిల్లలు ఇద్దరు కూడా కొండపైకి వెళ్ళారు.
ఆ రోజుల్లా కొండపైనే గడిపారు. –సశేషం

క్లిక్

# నేను నిగర్విని

## మెహెరాజాద్‌లో బాబావారి గదిలో కనిపిస్తుంది ఈ చిత్రం




నేను నిగర్వినని
డాంభికాలు పలకొద్దు.
**కారు చీకటిలో,**
నల్లని రాయి
మీద
కూర్చున్న
నల్లని చీమ కాలు
కనిపించినంత గర్వమైనా
తప్పక నీలో ఉంటుంది.
ఒక పెద్ద పర్వతాన్ని
భూమి లోనించి
గుండు సూదితో
తొలగించడం చాలా
సులభం.
కానీ, నీలోని గర్వాన్ని
తొలగించడం
చాలా కష్టం.
ఇదీ ఈ ఫోటోలోని
అక్షరమాల సారాంశం!!
మీ స్పందన
తెలియజేయండి.
**ఎడిటర్...**

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి.
పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.

# మెహెర్‌స్థాన్ ధర్మశాల వార్షికోత్సవం
## 2014 జూలై 27

మెహెర్‌స్థాన్‌లో ప్రతినెలా జరిగే ప్రేమిక సహవాస్
అలాగే, స్థానిక ధర్మశాల 8వ వార్షికోత్సవం జూలై 27న ఘనంగా జరిగాయి.
మెహెరాబాదు నుంచి బాబా ట్రస్టు సభ్యులు మెహెర్‌నాథ్ కల్చూరి, రమేష్ జంగ్లే
శ్రీ ఆర్.బి. గయక్వాడ్ తదితరులు హాజరయ్యారు.
శ్రీ కోడూరి శివరామకృష్ణ ప్రసాద్ సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మెహెర్‌నాథ్ కల్చూరి మాట్లాడుతూ,
శ్రీ వై.యస్. రావు తనని గత సంవత్సరం ధర్మశాల వార్షికోత్సవానికి తప్పనిసరిగా
హాజరుకావాలని కోరారన్నారు. "వచ్చే ఏడాదికి నేను మిమ్మల్ని పిలవగలనో లేదో
అన్నాడాయన". ఎట్టి పరిస్థితుల్లోనైనా రావాలని నాపై చాలా ఒత్తిడి చేశారు.
కానీ, మా తండ్రి భావూ కల్చూరి అనారోగ్యంతో వుండటంతో ఆనాడు
నేను రాలేక పోయాను. ఆ దరిమిలా జరిగిన పరిణామాలు మీ అందరికీ తెలుసు.
ధర్మశాల వార్షికోత్సవానికి నేడు హాజరయి, రావుగారి కోరికను మన్నించానన్నారు.
మెహెర్‌నాథ్. బాబా సందేశాలపై ఆయన ప్రసంగిస్తూ, బాబా తన ప్రేమికుల అహంకార
నాశనానికి దోహదపడేవారని ఒక ఉదాహణతో ఇలా చెప్పారు.
బాబా మండలి సభ్యులు అర్జున్, రుస్తుం, విష్ణులలో బాబా అర్జున్‌ని అమితంగా
ప్రేమించేవారు. ఈ విషయం మిగిలినవారిలో కొంత బాధ కలిగిస్తుంది.
రుస్తుం, విష్ణు మాస్టర్‌లకు ఆర్జున్ పట్ల ద్వేషం పెరుగుతుంది.
ఇది బాబా చెవులను తాకింది. దాంతో, బాబా ఒకరోజు ఉదయాన్నే
ఈ ముగ్గురు మండలి సభ్యుల్ని తన గదికి పిలిపించారు.
బాబా వారిని ఉద్దేశించి, ముందుగా రుస్తుంని తన చెంపపై గట్టిగా కొట్టమన్నారు.
ఈ మాటతో హతాశుడైన రుస్తుం, నీకు ఇష్టం లేకపోతే నన్ను వెళ్ళి పొమ్మనమని
ఆదేశిస్తే, అహ్మద్‌నగర్, మెహెరాబాదులను కూడా వదిలి, దూరంగా ఎక్కడికైనా
వెళ్ళిపోతాను గానీ, అవతారునిపై చెయ్యి ఎత్తలేనన్నాడు.
ఆ తర్వాత బాబా విష్ణు మాస్టర్‌ని బాబా ఆదేశించారు.
అతనూ బాబా ఆదేశాల పట్ల తన అశక్తిని వెలిబుచ్చాడు.
ఆ దరిమలా, బాబా అర్జున్‌ని ఆదేశించారు.
మారు మాట్లాడకుండా అర్జున్ బాబా చెంపపై గట్టిగా కొట్టి
వినమ్రంగా ప్రక్కనే నిలుచున్నాడు.




ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించకుండా
బాబా చెప్పిన విషయాన్ని విధేయతతో అమలుచేసిన అర్జున్‌ని బాబా అభినందించారు.
ఇప్పుడు అర్ధమయ్యిందా?
అర్జున్‌ని తానెందుకు అమితంగా అభిమానిస్తానో అన్నారు బాబా.
మండలి సభ్యురాలు నాజాకు సంబంధించిన మరో చిన్న సంఘటన గురించి మెహెర్‌నాథ్ ఇలా వివరించారు. మెహెరాబాద్‌లో నాజా డ్యూటీ ఏమంటే,
ప్రతిరోజూ బాబా పరివారం అందరి కోసం వంటలు వండేది.
ఆమెకు బాబా సమక్షంలో కూర్చుని, బాబా చెప్పే అనేక ఆధ్యాత్మిక విషయాలు ఆలకించే అవకాశం లేదని ఆమె తరచు బాధపడుతుండేది.
మనస్సులో ఏదో ఒక మూల ఆమెకు ఈ బాధ వుండేది.
ఇది గమనించిన బాబా ఓ రోజున ఆమె సమక్షంలో
జీసస్ క్రీస్తుకు సంబంధించిన విషయాలను చెప్పారు.
జీసస్ దగ్గర మెక్‌డోనల్, మార్తా అనే ఇద్దరు శిష్యురాళ్ళు వుండేవారు.
మార్తా జీసస్ వెన్నంటే వుండేది. ఆయన మాటలు ఆసక్తిగా వింటూ వుండేది.
అయితే మెక్‌డోనల్‌కు ఆ అవకాశం లేదు.
ఆమె ఎప్పుడూ వంటశాలలో వంటలు వండుతూ సతమతమవుతూ వుండేది.
అయితే మెక్‌డోనల్ ఎన్నడూ తాను జీసస్‌కు దూరంగా వున్నానని భావించలేదని, అది పరమాత్మ తనకు కల్పించిన అవకాశంగా, ఒక అదేశంగా, అదే తన అదృష్టంగా ఆమె భావించిందని బాబా వివరించారు.

అవతారుడు ఏ పనిని అప్పగించినా దానిని ఇష్టంగా అమలు పరచడం అత్యవసరమని చెప్పకనే చెప్పడంతో నాజా మనస్సులోని ఆ ఆలోచనలకు స్వస్తి పలికిందని మెహెర్‌నాథ్ రసవత్తరంగా చెప్పారు. ట్రస్టీ సభ్యులు శ్రీ రమేష్ జంగ్లే బాబా సందేశాలపై ప్రసంగించారు. వీరి ఆంగ్ల ప్రసంగాలను తెలుగులో శ్రీ బి. రామక్రిష్ణయ్య అనువదించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమాలను శ్రీ రామక్రిష్ణయ్య చక్కగా నిర్వహించారు.

శ్రీ మల్లిక్ & పార్టీ, శ్రీ మల్కిపురం రామారావు, శ్రీ పందుగ రమణ, శ్రీమతి పద్మావతి, కుమారి, గోపాలపురం సెంటర్ ప్రేమికులు తదితరులు బాబా సంకీర్తనలను మధురంగా ఆలాపించారు. మెహెరాబాద్ నుండి వచ్చిన అమెరికన్ బాబా ప్రేమికురాలు ఇంగ్లీషులో గానం చేసిన సంకీర్తనకు **తెలుగులో తలుపు తీయుమా** అని అనువదించిన గీతాన్ని, అదే రాగం – పల్లవిలో శ్రీ ఎ. నారాయణరావు, రాజమండ్రి చక్కగా ఆలాపించారు. విచ్చేసిన అతిధులకు శ్రీ వై.యస్. రావు కుటుంబ సభ్యులు చక్కని ఆతిధ్యం ఇచ్చారు. అలాగే జ్ఞాపికలు అందజేశారు.

ముందుగా స్థానిక పుర వీధులలో బాబా నామం స్మరిస్తూ నగర సంకీర్తన చేశారు. చివరిగా మెహెరాబాద్ నుండి విచ్చేసిన అతిధులు రాజమండ్రి బాబా సెంటర్‌ను సందర్శించారు. అక్కడ బాబావారి ప్రార్ధనలు, ఆరతి చేశారు.

## ఆంధ్ర గెస్ట్ హౌస్‌కు మంచినీటి సరఫరా

ట్రస్టు సభ్యులకు వీడ్కోలు పలుకుతూ, శ్రీ పి.యస్.ఆర్. బోస్, రాజమండ్రి, ఆంధ్ర గెస్ట్ హౌస్‌కు మంచినీటి సరఫరా గత కొన్ని నెలలుగా నిలిపివేసిన విషయాన్ని ట్రస్టు సభ్యులు పునపరిశీలించాలని కోరారు. ఈ చర్య అవాంఛనీయమన్నారు. గెస్ట్ హౌస్‌కు వచ్చేవారందరూ కేవలం బాబా ప్రేమికులేనని ఆయన గుర్తుచేశారు. గెస్ట్ హౌసు ఫుల్ కెపాసిటీలో కేవలం 400 మందికి మాత్రమే వసతి సౌకర్యం కల్పిస్తుందన్నారు. అమరతిధి రోజున మాత్రమే ఆంధ్రా గెస్టు హౌసు ఫుల్ కెపాసిటీలో వసతి కలిపిస్తుంది. ఏడాదిలో మిగిలిన రోజులలో సగటున రోజుకి 6 నుండి 10 మంది మాత్రమే గెస్ట్ హౌసులో ఉంటారు. వీరి నీటి వాడకం ఏపాటిదో మీరే ఊహించండన్నారు. వ్యక్తిగత అభిప్రాయ బేధాలతో ఈ అనుచిత నిర్ణయం ట్రస్టు తీసుకుందని తెలుగువారందరూ అభిప్రాయపడుతున్నారన్నారు.

తెలుగు బాబా ప్రేమికులు ట్రస్టు నిర్వహణకు తమవంతుగా విరాళాలిసున్న సంగతిని గుర్తు చేశారు. ఈ మాదిరి గెస్ట్ హౌసులను ప్రోత్సహించాలని శ్రీ బోసు కోరారు. కాగా, ఈ మేరకు లిఖిత రూపకంగా తగిన విన్నపాన్ని ట్రస్టుకు పంపవల్సిందిగా శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరి, శ్రీ రమేష్ జంగ్లే కోరారు.

# బాబా అంతరంగం

ఇది బాబా పంచగనిలో ఏకాంతవాస సమయంలో జరిగిన యదార్థ సంఘటన.
మండలి సభ్యుడు ఛగన్‌ని పిలిచి, తన దగ్గర పన్జేయడానికి ఒక కుర్రాడిని బాబా వెదకమన్నారు. ఛగన్‌జీ కూడా చాలా కాలంగా అదే పనిలో ఉన్నాడు.
ఐతే, ఒకరోజున వాయ్ అనే గ్రామంలో హోటల్‌లో ఒక అందమైన కుర్రాడు ఛగన్ గారి కంటబడ్డాడు. ఇతనైతే బాబా దగ్గర పనిచేయడానికి బాగుంటాడనుకున్నాడు.
ఛగన్‌జీ ఆ కుర్రాడితో ఈ మాటే అన్నాడు.
కొంతసేపు సంశయించి, తన యజమానితో మాట్లాడమన్నాడు.
ఆ హోటలు యజమానిని ఎలాగో ఒప్పించి, ఛగన్ గారు ఆ కుర్రవాడిని బాబా దగ్గరకు తీసుకెళ్ళాడు. బాబా అతగాడిని చూడగానే తన అంగీకారం తెలిపారు.
కొన్ని క్షణాలలోనే బాబా మనస్సు మార్చుకున్నారు.
అతని కాలికి ఏదో గాయం ఉందన్నారు.
అది నీవు చూడలేదా? అని ప్రశ్నించారు.
అంతేకాదు, ఆ గాయానికి మందు వేయించమన్నారు.
అందుకోసం, అతడిని ముందుగా మెహెరాబాద్‌కు తీసుకెళ్ళమన్నారు.
అక్కడ ఆ గాయానికి పాద్రీ చేత చికిత్స చేయించమన్నారు.
గాయం తగ్గిన తర్వాత ఆ కుర్రాడిని తన వద్దకు పాద్రీని తీసుకురమ్మన్నారు.

***

అతగాడి కాలికి తగిలిన గాయం చాలా చిన్నది.
అంతమాత్రానికి పాద్రీ దగ్గర చికిత్స చేయించాలా?
ఛగన్‌కు చిర్రెత్తింది. చికాకు వేసింది.
అనవసరంగా తనని మెహెరాబాద్‌కు పంపుతున్నారనుకున్నాడు.
అంతగా కావాలంటే, అతగాడి పుండుకి వైద్యం చేసే వైద్యుడు పంచగనిలో లేడా? అనుకున్నాడు. ఇదంతా మానసిక సంఘర్షణే.
బయటకేం అనగలడు. బాబా చెప్పినటట్లు బుద్ధిగా
ఆ కుర్రాడిని తీసుకుని వెళ్ళబోతుంటే, బాబా తిరిగి ఛగన్ వెనక్కి పిలిచారు.
ముందుగా పూణే వెళ్ళమన్నారు.
అక్కడ బాబా ప్రేమికుడు సదాశివ పాటిల్‌ని కలవమన్నారు.
ఆయనికి అందించమని ఒక లేఖ కూడా ఇచ్చారు.
ఆ తర్వాత ఆ కుర్రాడితో పూణేకి బయలుదేరాడు ఛగన్‌జీ,

పూణేలో సదాశివ ఇంటికి చేరుకునేలోగా
ఒక వీధిలో, వీధి కుళాయి దగ్గర
ఒక ముస్లిం స్త్రీ నీళ్ళు పట్టుకుంటూ ఛగన్‌జీని,
ఆతనితో ఉన్న కుర్రాడిని చూసి
గట్టిగా ఏడుస్తూ ఒరేయ్ యూసుఫ్! యూసుఫ్!
ఇంతకాలం ఎక్కడికి పోయావురా అంటూ ఆ కుర్రవాడిని అక్కున చేర్చుకుంది.
ఇది నీవేనా అని నమ్మలేకపోతున్నా అందామె.
రాత్రనక, పగలనక నీకోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నానంది.
మీ అమ్మని మర్చిపోయావురా అని అడిగింది.
ఇదంతా చూస్తున్న చుట్టుప్రక్కల వారు గుమ్మిగూడారు.
ఛగన్ మాస్టారుకి ఏమీ పాలుపోలేదు.
ఏం జరుగుతోందో ఒక్క క్షణం అర్థం కాలేదు.
అంతమంది జనం మధ్య ఒంటరిగా ఉన్నానని ఛగన్‌జీ భయపడ్డాడు.
ఆ తర్వాత దగ్గర్లోనే ఉన్న సదాశివ ఇంటికి వెళ్ళి జరిగినదంతా అతనితో చెప్పాడు.
సదాశివతో కలసి ఛగన్  ఆ ముస్లిం వనిత దగ్గరకు వచ్చాడు.
సదాశివ అసలేం జరిగిందని ఆమెతో వాకబు చేసాడు.
ఏతావాతా తెలిసిందేమంటే,
సుమారు ఐదేళ్ళ వయస్సులో ఆ కుర్రాడు ఇంటి నుంచి పారిపోయాడు.
తల్లితండ్రులు అతని కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.
ఇక తిరిగి అతగాడిని చూడగల్గుతామన్న ఆశ వారిలో నశించింది.
ఈ నేపథ్యంలో పిల్లవాడిని చూసిన తల్లి ఆనందం హద్దులు దాటింది.
అయితే ఛగన్ సంకట స్థితిలో పడ్డాడు.
బాబా ఆ కుర్రాడిని మెహెరాబాద్‌కి తీసుకెళ్ళమని ఆదేశించారు.
ఈ సమయంలో ఆ మాట చెబితే ఆ తల్లి ఒప్పుకుంటుందా?
ఛగన్‌జీ సదాశివ పాటిల్ సలహా అడిగాడు.
ఆయన సలహా మేరకు,
జరిగిన సంగతంతా క్లుప్తంగా బాబాకు టెలిగ్రాం పంపారు.
తిరుగు టపాలో బాబా కూడా టెలిగ్రాంలో జవాబిచ్చారు.
ఆ కుర్రవాడిని తల్లితండ్రుల దగ్గర వదిలి
పంచగనికి ఛగన్‌ని వెంటనే వచ్చేయమన్నారు.
అప్పుడు అర్థమైంది ఛగన్ మాస్టారుకి
బాబా అంతరంగం.



63వ మౌన వార్షికోత్సవం సందర్భంగా 1988 జూలై 10న మెహెరాబాద్‌లో మెహెరామాయి టేబుల్ హౌసులో అవతారుడిని దర్శించుకున్న అరుదైన చిత్రం..

**-ఫోటో పంపినవారు శ్రీ ఆర్. రామచంద్రయ్య, ఖమ్మం**

## రాజాం సెంటర్ 38వ వార్షికోత్సవం

శ్రీకాకుళం జిల్లాలోని రాజాం బాబా సెంటర్‌లో 38వ వార్షికోత్సవాన్ని 2014 సెప్టెంబరు 21, ఉ.6.30 నుండి మధ్యాహ్నం 2 గంటల దాకా నిర్వహిస్తున్నట్లు సెంటర్ కార్యదర్శి శ్రీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

## తాడేపల్లిగూడెం బాబా సెంటర్

89వ మౌన వార్షికోత్సవం కడు వైభవంగా నిర్వహించినట్లు డా॥ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 89 మంది ప్రేమికులు మౌనం పాటించారు. అంతే కాకుండా సుమారు 200 మంది స్థానికులు ఈ సందర్భంగా బాబా కేంద్రమును సందర్శించినట్లు డా. సారథి తెలిపారు.

# మెహెర్‌బాబా

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**

# మాయదారి కోడిపిల్ల

**సైతాన్ ముర్గీకా బచ్చా, రాగ్: దేవ గాంధారి, తాల్: ఆది**

**-బెజ్జంకి వేంకట సుబ్బారావు, గుంటూరు**

ప॥ మాయదారి కోడిపిల్ల పారిపోయింది
పట్టుకొచ్చి తెక్క క్రింద పెట్టుకోవే

1. ఆదిలేని ఆదియందు ఏమి లేదు - అస్సలేమిలేదు
కాని ఒక్క కోడిపెట్ట వున్నదంట - ఒక్కటున్నదంట
ఆ కోడికి పిల్లలేమొ కోకొల్లలు - అవి కోకొల్లలు
చీకటిలో తెక్క క్రింద దాచి వుంచింది

2. ఆ పిల్లల కతిభయము - తెలివిలేదు - వాటికి తెలివి లేదు
లెఖ్ఖలేని యుగాలెన్నొ గడచిపోయె - వాటికి గడచిపోయె
తల్లి కోడి అన్నిటిని కాపాడుచునే యుండె
ఒక తుంటరి కోడిపిల్ల విసిగిపోయే చీకటిలో ॥

3. విసికిపోయి తప్పించుక పారిపోయింది
బయట నున్న వెలుగు ("తేజ్") చేసి భయపడింది
ఆరుసార్లు వెనక్కెళ్ళి మళ్ళీ వచ్చింది
రంగు లేని కాంతి జూసె ఏడవసారి
భయపడక ముందుకే సాగిపోయింది ॥

4. అంతులేని దూరాలకు పయనమయింది
కొంత దవ్వు కెళ్ళగానె - ఆకలేసింది
బిక్కు బిక్కు మంటూనే ఊహనడిగి చూసింది
తనను ఆరగించమని ఊహవచ్చి ముందునిల్చె ॥

5. "ఊహ" నారగించి సాహసాలు చేయబూనె
14 సాహసాలు చేయను ఆరంభించె
మొదటి 7 చేసి తాను మనిషిగా మారిపోయె
సుఖదు:ఖాలను రెంటిని - అనుభవించి తీరింది ॥

6. ఆకలేమొ తగ్గసాగె అష్టమ సాహసములోన
"ఊహ" అనే ఆహారం అతి తక్కువగా తినుచు
13వ సాహసమున మలుపుతిరిగె కోడిపిల్ల
"ఊహ" అనే ఆహారం వెగటు వేసి మానివేసె ॥

7. ఇప్పుడేమి చేయాలి - అని అరచెను కోడిపిల్ల
"నిన్ను" నీవె తినమని - ఒక గొంతు వినిపించె
గత్యంతరమేమిలేక - తనను తానె తినివేసె
తానే "సర్వము"నని తెలుసుకున్నదాక్షణములో
సర్వమనగ "శక్తి - జ్ఞాన - ఆనందము" లేయగు ॥



మహాబళేశ్వర్‌ను మెహెర్‌బాబా అనేకసార్లు సందర్శించారు. ఆ విషయాలు మరో సందర్భంలో ప్రస్తావించుకుందాం. మహాబళేశ్వర్‌లో ఆర్థర్ సీట్ పాయింట్‌ని సందర్శించినప్పుడు మెహెర్‌బాబాకు తీసిన ఫోటో ఇది. ఇదొక చక్కని వ్యూ పాయింట్. బొంబాయి ప్రెసిడెన్సీ గవర్నరుగా పనిచేసిన సర్ జార్జ్ ఆర్థర్ (1841-1846) జ్ఞాపకార్థం ఆయన పేరు పెట్టారు. మహబళేశ్వర్‌లో ప్రకృతిని వీక్షించేందుకు ప్రధానంగా 16 వ్యూ పాయింట్లు ఒకే ప్రాంగణంలో వున్నాయి. ఆర్థర్ సీట్ పాయింట్‌ని **క్వీన్ ఆఫ్ ది పాయింట్స్** అని పిలుస్తారు. ఇక్కడ కొన్ని వందల అడుగుల లోతులో సావిత్రీ నది గల గలా ప్రవహిస్తూ కనిపిస్తుంది.

# విశ్వనాథయ్య బాబాలో ఐక్యం

శ్రీ కెఎస్ విశ్వనాథయ్య (82), మారుతీ లాడ్జి, హిందూపురం, 2014 ఆగస్టు 9 మ.3.45 బాబా నామస్మరణతో బాబాలో ఐక్యమయ్యారని శ్రీ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా సత్సంగ్ ఆగస్టు 31న ఉ. 11 గంటలకు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్, ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

**ప్రియ దైవమా!**

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యతం

**2012 జులై - ఆగష్టు నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01. | ఆగష్టు | ఎల్. బాలక్రిష్ణారావు, పార్వతీపురం, విజయనగరం | రూ. 500.00 |
| 02. | ఆగష్టు | పి.ఎన్. సునీత, బెంగుళూరు | రూ. 1000.00 |
| 03. | ఆగష్టు | కొంపల్లి మెహెర్‌క్రాంత్, తాపేశ్వరం, తూ.గో.జి | రూ. 1000.00 |
| 04. | ఆగష్టు | డి. మారుతిరావు, అనంతపురం | రూ. 500.00 |
| 05. | ఆగష్టు | ఎన్. లక్ష్మినారాయణరావు, కరీంనగర్ | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 4000.00** |

❋ శ్రీ జి.ఎన్.సుబ్రహ్మణ్య శర్మ, విశాఖపట్నం గారి పేరు గత నెల జులైలో జి.ఎన్.సుబ్రహ్మణ్య శాస్త్రి అని తప్పుగా ప్రచురించడమైనది. గమనించగలరు.

## పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు). ఆన్‌లైన్‌లో పంపగోరువారు.శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్. **SB A/C NO: 173201000027973.**
**IFSC CODE: IOBA 0001732.**

### మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్,**
**యాప్రాల్,**
**ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500087.**
**ఫోన్:99595-53218,**
**email: malladisukku@gmail.com,**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**
RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month